Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

శనివారం, అక్టోబర్ 26, 2024 | సంపుటి - 20 | సంచిక 30 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.



విలేకరులు కావలెను

అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును

రాజకీయ అవగాహన కలిగిన కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.

వివరాలకు సంప్రదించండి 6305584064


## దగ్గర పడుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు

**కమలా గెలిస్తే చైనా ఆడేసుకుంటుందున్న ట్రంప్**



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధ్యక్ష అభ్యర్థుల ప్రచారం మరింత జోరందుకుంది. ఓటర్ల ను ఆకట్టు కోవడం కోసం హామీలతో పాటు పరస్పర విమర్శలతో ప్రచారం అంతకం తకూ వేడెక్కుతోంది. 2లో

## మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయ

**ఇకముందు ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దు**

**పరువు నష్టం కేసు విచారణ వచ్చే నెల 21కి వాయిదా**



హైదరాబాద్ : మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు మొట్టికాయలు వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని మండి పడింది. ఓ బాధ్యత కలిగిన మహిళా మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిదని వ్యాఖ్యానించింది. 2లో

# హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**మూసీ పునరుజ్జీవం..బాపూ ఘాట్ అభివృద్ధి**

**వీటిని అడ్డుకోవాలని చూస్తున్న బిఆర్ఎస్, బిజెపి**

**సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు**



మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోంది. కానీ గాంధీ వారసులుగా అంతర్జాతీయ స్థాయిలో బాపూ ఘాట్‌ను అభివృద్ధి చేసి తీరుతాం. కానీ బీజేపీ, బీఆర్ఎస్ వీటిని ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సదరన్ రైజింగ్ సమ్మిట్ లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు.

హైదరాబాద్ : గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూ ఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా నగరంలోని బాపూ ఘాట్ ను అభివృద్ధి చేస్తాం. దేశం మొత్తం మాట్లాడుకుంటున్న సర్దార్ పటేల్ విగ్రహం తరహాలో హైదరాబాద్ లోని బాపూ ఘాట్‌లో మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం అన్నారు. తెలంగాణలో ఫాంహౌస్ పాలిటిక్స్ చేస్తున్నారని, దేశంలో ఎక్కడైనా ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ఉన్నారా..అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్యాలెస్ పాలిటిక్స్ చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారం కోల్పోయినా కేసీఆర్ ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ప్రజల తరపున గొంతుక అసెంబ్లీలో వినిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 2లో




# పేదల ఇళ్లజోలికి వస్తే ఖబర్దార్

**సుందరీకరణకు ఓకే... ఇల్లు కూల్చివేతలకు నో**

**మూసీ సుందరీకరణ పేరుతో స్కామ్**

**సుందరీకరణతో డబ్బులు దండుకునే యత్నం**

**బిఆర్ఎస్ బాటలోనే రేవంత్ సర్కార్**

**మూసీ బాధితులకు మద్దతుగా ధర్నాలో బిజెపి నేతల విమర్శలు**

మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, మూసీ పరివాహకంలో పేదలను తరిమివేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని బిజెపి స్పష్టం చేసింది. పేదలకు అన్యాయం జరగకుండా మూసీ సుందరీకరణ చేపడితే తాము కరసేవ కూడా చేస్తామని స్పష్టం చేసింది. మూసీ పేదలకు మద్దతుగా ఇందిరాపార్క్ వద్ద బిజెపి చేపట్టిన ధర్నాలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. మూసీ ప్రాజెక్ట్‌కు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్ : ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వారు మూడు నెలల పాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ ముఖ్యమంత్రి రేవంత్ చేసిన సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం వారి ఇళ్లలో నివాసం ఉండేందుకు మేము సిద్ధం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి కావస్తోందని.. నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికి రేవంత్ సర్కార్ శంకుస్థాపన చేయలేదని, భూమి పూజ చేయలేదని విమర్శించారు. ఏండ్లుగా నివసిస్తున్న నిరుపేదల ఇండ్లను కూలుస్తోందని మండిపడ్డారు. 2లో



# సిజెఐగా జస్టిస్ ఖన్నా 11న ప్రమాణం

**ఆరు నెలలపాటు పదవిలో కొనసాగనున్న ఖన్నా**




న్యూఢిల్లీ : భారత సుప్రీం తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఆయన ఈ నెల 11న బాధ్యతలు చేపడతారు. కేవలంఆరు నెలలు మాతరమే పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఖన్నా, ప్రస్తుత సిజెఐ చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత నవంబర్ 11న ఆ పదవిని చేపట్టనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ ఇప్పటికే జస్టిస్ ఖన్నా పేరును తుదిపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. ప్రస్తుత న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత, నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ నవంబర్ 8, 2022న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ ఖన్నా నియామకానికి ప్రభుత్వ ఆమోదాన్ని ధృవీకరిస్తూ, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ 2లో

## భారత్, చైనాల మధ్య కుదిరిన సయోధ్య


**సరిహద్దు వెంబడి బలగాల ఉపసంహరణ**

**వెనక్కి వెళుతున్న ఇరు దేశాల బలగాలు**



2లో

న్యూఢిల్లీ : భారత్, చైనాల మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త తలకు ముగింపు పలికేలా ఇటీవల ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. ఇది చర్చలకు ఉన్న బలమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.



## నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశం

**పలు అంశాలపై సుదీర్ఘ చర్చ**

న్యూఢిల్లీ 25: భారత ప్రధాని నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్స్ లర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశ మయ్యారు. పలు అంశాలపై చర్చించేందుకు గాను శు క్రవారం వీరిద్దరూ సమావేశ మయ్యారు. ఇందులో భాగంగానే ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా రక్షణ, వాణిజ్యం, స్వచ్ఛ ఇంధన రంగాలపై ఇరువురు నేతలు విస్తృత స్థాయిలో చర్చలు జరపున్నట్లు తెలుస్తోంది. మిగతా 2లో

# కరెంటే ఛార్జీలే తెలంగాణ ఉద్యమ పునాది




**కాంగ్రెస్ పది నెలల పాలనలో మళ్లీ పాతరోజులు**

**ఛార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించండి**

**ఇఆర్‌సి బహిరంగ విచారణలో కెటిఆర్ వినతి**


రాజన్నసిరిసిల్ల : కరెంట్ ఛార్జీల పెంపు కారణంగానే తెలంగాణ ఉద్యమం పుట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆనాడు ఛార్జీలు పెంచితేనే కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టారని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అదే పరిస్థితి తేవటం శోచనీయమని అన్నారు. ఈఆర్సీ ఛైర్మన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని.. ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేకూర్చే ప్రతిపాదనలను తిరస్కరించాలని మిమ్మల్ని కోరుతున్నా అని అన్నారు. విద్యుత్ వ్యాపార వస్తువుగా చూడవద్దని.. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా భావించాలని కోరారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నా నియోజకవర్గంలోని సెస్ అనేది చాలా ప్రతిష్టాత్మక సంస్థ అని కేటీఆర్ తెలిపారు. దేశంలో సహకార రంగంలో ఉన్న చాలా తక్కువ విద్యుత్ సంస్థల్లో సెస్ ఒక్కటి అని చెప్పారు. మిగతా 2లో

## నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టివేత

**రూ.25 లక్షలు విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం**

**బెంగళూరు, గోవా నుంచి మాదకద్రవ్యాల సరఫరా**

**నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ వెల్లడి**



2లో

## దగ్గర పడుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు

తాజాగా అగ్రరాజ్య ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ పై రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఆమె అధికారంలోకి వస్తే చైనా ఆడేసుకుంటుందని ఎద్దేవా చేశారు. ప్రచారంలో భాగంగా ట్రంప్ ఓ రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా హోస్ట్ మాట్లాడుతూ.. ఒకవేళ కమలాహారిస్ విజయం సాధిస్తే ఆమె చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో చర్చలు జరపాల్సి ఉంటుంది. అప్పుడు ఆమెతో జిన్‌పింగ్ ఎలా వ్యవహరిస్తారని ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి మాజీ అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఓ చిన్న పిల్ల మాదిరిగా ఆమెను చూస్తారని అంటూ వ్యాఖ్యానించారు. ఆమెను చిన్న పిల్లను చేసి చాక్లెట్లను లాగేసినట్లు మనదంతా దోచుకుంటారు. ఏం జరుగుతుందో కూడా ఆమెకు అర్థం కాదు. చెస్‌ను అప్పుడే మొదలుపెట్టిన ఆటగాడితో గ్రాండ్ మాస్టర్ ఆడితే ఎలా ఉంటుందో.. వారిద్దరి చర్చలు కూడా అలాగే ఉంటాయని అంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. ఆమెకు మరో నాలుగేళ్లు అధికారిమిస్తే ప్రజల జేబులన్నీ ఖాళీ చేస్తారంటూ దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో ట్రంప్, హారిస్ మధ్య ఉత్కంఠ పోరు ఉండనున్నట్లు పోల్ సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఈ సర్వేల్లో మొన్నటివరకు హారిస్ ఆధిక్యంలో ఉండగా.. తాజాగా ట్రంప్ కాస్త ముందంజలోకి వచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ నిర్వహించిన సర్వేలో ట్రంప్‌నకు 47శాతం మద్దతు రాగా.. హారిస్‌కు 45శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక, సీఎన్‌బీసీ ఆల్ అమెరికన్ ఎకనమిక్ సర్వేలోనూ ట్రంప్ .. హారిస్ కంటే రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. అటు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉండనున్నట్లు సర్వేలు అంచనా వేస్తున్నాయి.

## భారత్, చైనాల మధ్య కుదిరిన సయోధ్య

అందుకు అనుగుణంగానే సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియ తాజాగా మొదలైంది. తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లోని రెండు కీలకప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్ నుంచి రెండు దేశాల బలగాలు వెనక్కి మరలుతున్నట్లు భారత రక్షణశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాంతంలోని సైనిక సామగ్రి, ఇతర పరికరాలను భారత బలగాలు వెనక్కి తీసుకొస్తున్నట్లు ఆ అధికారులు పేర్కొన్నారు. ఇక్కడి టెంట్లు, తాత్కాలిక నిర్మాణాలను కూడా ఇరుదేశాల బలగాలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చార్డింగ్ లా పాస్‌కు సమీపంలోని నదికి పశ్చిమదిశగా భారత బలగాలు, తూర్పు దిశగా చైనా బలగాలు వెనక్కివెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈప్రాంతాల్లో సరిహద్దులకు ఇరువైపులా దాదాపు 10–12 తాత్కాలిక నిర్మాణాలు, 12 టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బలగాల ఉపసంహరణ ప్రక్రియంతా పూర్తయిన తర్వాత మరో 4–5 రోజుల్లో డెస్పాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పునరుద్ధరించనున్నట్లు సమాచారం. వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరుదేశాల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం.. 2020 గల్వాన్ ఘర్షణలకు ముందు నాటి యథాస్థితి ఎల్‌ఏసీ వెంబడి కొనసాగనుంది. ఇరుదేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని ఇరుదేశాల నేతలు మోదీ, జిన్‌పింగ్ ధ్రువీకరించారు. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఈ ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాలు ఎల్‌ఏసీ వెంబడి భారీస్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటినుంచి రెండుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరుదేశాల మధ్య పలుమార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించగా.. ఘర్షణల కేంద్రమైన డెమ్చోక్, డెస్పాంగ్ వద్ద మాత్రం బలగాలు కొనసాగుతూ వచ్చాయి.

## నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్ : భాగ్యనగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. దాదాపు రూ.25 లక్షలు విలువ చేసే డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఇంటర్నేషనల్ ఫడ్లర్, అంతర్రాష్ట్ర ఫడ్లర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంది. రెండు ప్రాంతాల్లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. భారీగా డ్రగ్స్ పట్టుబడటంపై శుక్రవారం సీపీ సీపీ ఆనంద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాదక ద్రవ్యాలపై హైదరాబద్ పోలీసుల పోరు కొనసాగుతుందని సీపీ స్పష్టం చేశారు. గత నెల రోజుల్లో నార్కోటిక్ పని తీరుపై సమీక్ష చేసి బలోపేతం చేశామన్నారు. డ్రగ్స్ ముఠాలను అదుపు చేయాలని ఆదేశాలు ఇచ్చామని.. సింథటిక్ డ్రగ్స్ బెంగళూరు, గోవా నుంచి సరఫరా అవుతాయని... న్యాచురల్ డ్రగ్స్ ఒరిస్సా, ఛత్తీస్గఢ్, ఏపీ నుంచి సరఫరా అవుతున్నాయని వెల్లడించారు. బెంగళూర్‌పై ముందుగా దృష్టి పెట్టామని.. ఇందులో రెండు ముఠాలను హెచ్ న్యూ పట్టుకుందని తెలిపారు. వీళ్ళు అందరూ కూడా ఆఫ్రికా దేశానికి చెందినవారన్నారు. మొదటి గ్యాంగ్ లో సుడాన్ దేశస్థులు ఇద్దరు ఉన్నారని తెలిపారు. అబ్దుల్ రెహమాన్ నగరంలో కీలకంగా ఉంటూ లోకల్‌గా డ్రగ్స్ డెలివరీ బాయ్‌లాగా వ్యవహరిస్తున్నాడన్నారు. 2014 లో హైదరాబాదుకు స్టూడెంట్ వీసాపై వచ్చాడని.. అప్పటి నుంచి నగరానికి వస్తూ పోతూ ఉన్నాడన్నారు. గత రెండు సవత్సరాల క్రితం నగరానికి వచ్చి టోలిచౌకీలో ఉంటున్నాడని తెలిపారు. వీసా గడువు ముగిసిన కూడా టోలిచౌకిలో ఉంటున్నాడన్నారు. బెంగళూర్ నుంచి ఖుర్భా అనే సప్లయర్ డ్రగ్స్ ఆర్డర్ తీసుకుంటాడని.. అతనిపై ఇంకా హోల్ సేల్ సప్లయర్స్ ఉన్నారని.. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. రొమేనియా, టాంజానియా, కేరళ , నైజీరియాకు చెందిన మెయిన్ సప్లయర్‌లు ఉన్నారని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా బెంగళూరులో ఖుర్బా డ్రగ్స్ ఆర్డర్లు స్వీకరిస్తాడన్నారు. హనిన్ అనే వ్యక్తికి డెలివరీ చేయాల్సిన అడ్రస్ చేరవేస్తాడని.. హనిన్ ఇచ్చిన అడ్రస్‌కు రెహమాన్ వెళ్లి డ్రగ్స్ సరఫరా చేస్తాడన్నారు. ఒకరికొకరు కలుసుకోకుండా డ్రగ్స్ సప్లై చేస్తున్నారన్నారు. ఖుర్భాకు నేర చరిత్ర ఉంది. రెహమాన్ ఆపిల్ ఫోన్ సీజ్ చేశాం.. అందులో చాలా వివరాలు ఉన్నాయి. వినియోగదారుల వివరాలు కూడా వచ్చాయి. వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటాం. వారి వద్ద నుంచి సమాచారం సేకరిస్తాం... అవసరం అయితే అరెస్ట్ చేస్తాం అని సీపీ స్పష్టం చేశారు. ఇక రెండవ కేసులో కూడా బెంగళూరుకు సంబంధాలు ఉన్నాయి. ఇమ్రాన్ అనే వ్యక్తి బంజారాహిల్స్ ఉంటాడు. మత్తు పదార్థాలకు చిన్నప్పటి నుంచి అలవాటు పడ్డాడు. ఫిబ్రవరిలో యాష్ ఆయిల్ సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. జైలుకు వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు.. ఎండీఎంఏ డ్రగ్స్ సప్లై చేస్తూ పెట్టుబడ్డాడు. ఇమ్రాన్ బెంగళూరుకు వెళ్లి ఓ నైజీరియన్‌తో డ్రగ్స్ సేకరిస్తాడు. డెడ్ డ్రాప్ ద్వారా నందకుమర్ అనే వ్యక్తి నుంచి డ్రగ్స్ సేకరిస్తారు. నంద కుమార్‌ను కూడా అరెస్ట్ చేశాం. నైజీరియన్‌తో పాటు నవీన్ అనే కేరళకు చెందిన వ్యక్తి నుంచి కూడా ఇమ్రాన్ డ్రగ్స్ సేకరిస్తాడు . బెంగళూరులో ఉన్న నైజీరియన్‌ను అరెస్టు చేస్తాం. క్యాష్ ఆన్ డెలివరి డెడ్ డ్రాప్ ద్వారా పేమెంట్ తీసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తారని సివి ఆనంద్ తెలిపారు. వినియోగదారుల వివరాలు ఉన్నాయి. వారిని కూడా అదుపులో తీసుకుంటాం. వారి ద్వారా మిగతా కన్జ్యూమర్ల వివరాలు కూడా సేకరిస్తాం. నిందితులు డెడ్ డ్రాప్ అండ్ కాంటాక్ట్ లెస్ పద్ధతి ద్వారా డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. సోషల్ మీడియా స్నాప్ చాట్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్స్ తీసుకుంటున్నారు. డ్రగ్స్ ఆర్డర్స్ ఏ పద్ధతిలో తీసుకున్న మేము గుర్తిస్తాం. మ్యూల్ అకౌంట్ల ద్వారా ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నట్టు గుర్తించాం. మెయిన్ సప్లయర్లు అందరూ ఫేక్ ఐడెంటీలతో బెంగళూరులో ఉంటున్నారు. ఒరిస్సాలో హ్యాష్ ఆయిల్ తయారు చేస్తున్న ప్రాంతాన్ని గుర్తించాం. ఏపీ పోలీసుల సహకారంతో జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తాం.

# పేదల ఇళ్ల జోలికి వస్తే ఖబర్దార్

ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను గారడీలుగా మార్చి మసిపూసి మారేడుకాయ చేశారన్నారు. ప్రజలను సోనియా, రాహుల్, రేవంత్ మభ్యపెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ళు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేశారని.. ప్రజల ఇండ్లకు మార్కింగ్ వేసి ప్రజలను భయపెట్టారని తెలిపారు. కేసీఆర్ దారిలోనే రేవంత్ వెళ్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ పేదల ఇండ్లను కూలిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ సుందరీకరణ చేసుకోవాలన్నారు. మూసీ బాధితులు ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌కు మూసీ పక్కన ఉండలేక పోతున్నామని చెప్పారా.. మా ఇండ్లు కూల్చమన్నారా. రేవంత్‌కు కలపడినట్టు ఉంది. అయితే ఆ కల లక్షన్నర కోట్లపైన అయి ఉండొచ్చు.. కానీ పేద ప్రజలకు మంచి చేయాలనేది మాత్రం కాదు అంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ బాధితులకు అండగా బీజేపీ ఉంటుందని స్పష్టం చేశారు. వారికోసం అవసరమైతే చంచల్ గూడ జైలుకు అయినా, చర్లపల్లి జైలుకు అయినా వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రేవంత్ పోలీసులతో వస్తాడా? ఎలా వస్తాడో కానీ బస్తీల్లోకి రావాలి. ఆయన్ను ప్రజలు ఏమనకుండా మేము రక్షణగా ఉంటాం.. సెక్యూరిటీ విషయంలో ఆయనకు చింత అక్కర్లేదు. డ్రైనేజీ సిస్టం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యం. రేవంత్‌కు పేదలకు కనీస సౌకర్యాలు అందించడం ముఖ్యమా.. మూసీ సుందరీకరణ అవసరమో తేల్చుకోవాలి. వాస్తవానికి మాకు రెండూ ముఖ్యమే.. కానీ ముందు పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించి తర్వాత సుందరీకరణ చేసేవాళ్ళం. కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశ, దశ లేదు. ఎలా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటారో కూడా తెలియడం లేదు. ఒక బస్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాష్టికానికి ఓ వ్యక్తి గుండెపోటుతో చనిపోయారని తెలిసింది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన చెందకండి.. మీకు అండగా బీజేపీ ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. మూసీప్రాజెక్ట్ అంతా రాబర్ట్ వాద్రా కోసమే అని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు, ఈ ప్రాజెక్ట్ చేపడుతున్నారని అన్నారు. రాబర్ట్ వాద్రా ఇటీవల హైదరాబాద్ వచ్చి గుడిని దర్శించారని అంటున్నారని, అసలు విషయం మూసీ ప్రాజెక్ట్ కోసమేనని అన్నారు. మొన్నటి వరకు హైడ్రా జరిగింది.. ఆ బాధితుల్లో జేసీబీ, బుల్డోజర్లు అనే భయం కనిపించాయి. ఇప్పుడు మూసీ బాధితులను చూస్తుంటే వారిలో బీజేపీ ఉందనే భరోసా కనిపిస్తోంది. కాంగ్రెస్ విధానాలపై ప్రజలకు అండగా ఉండి బరా బర్ కొట్లాడుతాం అని బండి సంజయ్ స్పష్టం చేశారు. మూసీ ఒకప్పుడు మంచినీళ్లు అందించిందని.. ఇప్పుడు విషం కక్కుతోందన్నారు. నేను పాదయాత్ర చేసినప్పుడు కళ్లారా చూశా. మూసీ సర్వ నాశనం కావడానికి కారణం కాంగ్రెస్. పరిశ్రమలకు అడ్డగోలుగా పెట్టుకోవాలని చెప్పి అనుమతి ఇచ్చింది వారు కాదా. మొన్న రేవంత్ లండన్ పోయి ఒక నది చూశాడు.. అది చూసే లక్షన్నర కోట్లు అన్నాడు. నిన్న సియోల్‌కు నేతలను పంపాడు.. వాళ్ళు ఎంత చెప్తారో మరి. రేవంత్.. ముందు మంత్రులను మూసీ పరివాహక ప్రాంతాల్లో తిరగమను. అలా వెళ్తే ప్రజలు వాళ్ళను గంప కింద కుమ్ముతారనే భయం రేవంత్‌కు ఉంది. రేవంత్ మొన్న మూసీ సుందరీకరణ అని ఒకసారి అంటాడు.. పునరుజ్జీవనం అని ఒకసారి అంటాడు.. ఏంటో ఆయనకే క్లారిటీ లేదు. లక్షన్నర ఖర్చు అన్నాడు.. మళ్ళీ నేను అనలేదు అంటున్నాడు. మూసీ ప్రక్షాళన పేదల కోసం కాదు.. ఇదంతా కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా అల్లుడి కోసమే. బీఆర్ఎస్ నేతలకు దీనిపై మాట్లాడే హక్కు లేదు.. వారిది నోరా.. మోరా అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరు గ్యారెంటీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా, మూసీ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఒక డ్రామా కంపెనీ అని.. ఆ పార్టీలో ఎవరికీ వారు సీఎంలంటూ సెటైర్ విసిరారు. సబర్మతి ఖర్చు రూ.7 వేల కోట్లు అని, నమామి గంగ ఖర్చు రూ.40 వేల కోట్లు అయితే మూసీకి లక్షన్నర కోట్లా అని ప్రశ్నించారు. ఒక్క కిలోమీటర్‌కు 2 వేల కోట్లా అని నిలదీశారు. ఇంతకంటే కాస్ట్లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ప్రపంచంలో లేదన్నారు. దోషులు ప్రజలు కాదు.. అక్రమంగా కూల్చుతున్న ప్రభుత్వమే దోషి అని అన్నారు. మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో రేవంత్.. మేము కొట్లాడేందుకు సిద్ధం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం. మీ అల్లుడికి పైసలు కావాలంటే కాంగ్రెస్ నేతలు దోచుకున్న వాటిలో నుంచి ఇవ్వండి.. పేదల వద్ద నుంచి లాక్కుంటామంటే ఊరుకోం అంటూ బండి సంజయ్ హెచ్చరించారు. రేవంత్ లంకె బిందెలు ఖాళీగా ఉన్నాయని చెప్పావు కదా.. ఆ లంకె బిందెలు మూసీలో ఉన్నాయా? అంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. బీజేపీ మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ఆ ఇండ్లకు అనుమతి ఇచ్చారని.. ఇప్పుడు ఎలా అక్రమమయ్యాయో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణను ఏటీఎంలాగా మార్చుకోవాలనుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లు, అక్రమ సంపాదన కోసం పేదల ఇండ్లను కూలిస్తే ఉరుకోబోమన్నారు. మాకు లండన్, సియోల్ అక్కర్లేదు.. మాకు మా హైదరాబాద్ లాగానే ఉంచండి చాలు. గతంలో కేసీఆర్ ఇస్తాంబుల్ లాగా మారుస్తామని చెప్పారు. ఇప్పుడు మీరు లండన్, సియోల్ అంటున్నారు. రేవంత్ సర్కార్‌కు పేదల భూములే కనిపిస్తున్నాయా? ఎంఐఎం నేతలవి కనిపించడం లేదా. పేదలవి కూల్చి.. ఎంఐఎం నేతలవి ఎందుకు కూల్చడం లేదు. డీపీఆర్.. లేకుండా ఎలా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు.. ఎలా కూలుస్తున్నారు. పేదల ఇండ్లు కూలిస్తే ఊరుకునేది లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయ

అలాంటి వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని తెలిపింది. ఆమె వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ ఎ–లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది. మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టులో విచారణ జరిగింది. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను న్యూస్ ఛానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియాలో తొలగించాలని పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 21కి వాయిదా వేసింది. తన పరువుకు భంగం కలిగేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఆమెపై రూ.100కోట్లకు కేటీఆర్ దావా వేసిన విషయం తెలిసిందే. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించింది. అయినప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కేసులో కోర్టు తాజా కామెంట్లతో కేటీఆర్ కు బలం చేకూరినట్లయింది. కొండా సురేఖపై దాఖలుచేసిన పరువునష్టం దావాలో కేటీఆర్ ప్రజాప్రతినిధుల కోర్టులో తన వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. మంత్రి మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తనకు, పార్టీ ప్రతిష్ఠకు గండికొట్టాలనే ఉద్దేశంతో అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. బహిరంగంగా అసభ్య పదజాలాన్ని చదవడం మంచిదికాదని, ఆమె చేసిన వ్యాఖ్యలను పిటిషన్‌లో పేర్కొన్నట్టు విన్నవించారు. కావాలని తనపై నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ చెప్పారు. ఆ వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీడియాలో ప్రసారం అయ్యాయని, ఆ వార్తా కథనాల ద్వారా సాక్షులుగా ఉన్నవారు తీవ్ర కలత చెందారని తెలిపారు. టీవీల్లో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో, డిజిజల్ మీడియాలో వచ్చిన వార్తాకథనాలకు సంబంధించిన క్లిప్పింగులను ఫిర్యాదు పత్రానికి జోడించినట్టు వివరించారు.

## కరెంటే ఛార్జీలే తెలంగాణ ఉద్యమ పునాది

మా నేతృత్వంలోని ఇక్కడి సెస్ పాలక వర్గం బ్రహ్మాండంగా పనిచేస్తోందని అన్నారు. డిస్కంలతో పోల్చితే మా సెస్ పనితీరు 100 శాతం మెరుగు అని గర్వంగా చెబుతున్నా అని అన్నారు. గతంలో సెస్ ను రాష్ట్ర ప్రభుత్వంలోని సంస్థల్లో కలపాలని ప్రయత్నిస్తే ఇక్కడి ప్రాంత వాసులు వ్యతిరేకించారని గుర్తుచేశారు. వ్యవసాయ విద్యుత్‌ను 5 నుంచి 7.5 హెచ్‌పీకి పెంచాలని.. 7.5 హెచ్‌పీకి సబ్సిడీ ఇవ్వాలని కోరారు. గతంలో ఎన్‌పీసీడీఎల్ సగటు ధర నిర్ణయించేదని.. కానీ ఆ తర్వాత బల్క్ సప్లయ్ టారిఫ్ ఆధారంగా నిర్ణయిస్తోందని.. సర్ ఛార్జీ కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. సెస్ ను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిపుష్టమైన సబ్సిడీ ఇస్తూ ఎప్పటికప్పుడు ఆ డబ్బు ప్రభుత్వం నుంచి సంస్థకు వచ్చే విధంగా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత శాసనసభ్యునిగా నేతన్నల సమస్యలు తెలిసిన వ్యక్తిగా మిమ్మల్ని విజ్ఞప్తి చేస్తున్నా అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాడు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిరా పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి ఉండేదని.. మరోవైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి ఉందని గుర్తు చేశారు. సిరిసిల్లలో కూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్‌తోనే ముడిపడి ఉందన్నారు. ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్‌తో విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు పదేళ్ల పాటు విద్యుత్ సంస్థలకు స్వర్ణయుగంగా మారిందని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని తెలిపారు. దానికి తోడు ఇప్పుడు కరెంట్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాలకులకు విజన్ ఉంటే.. సంపద పెంచి పేదలకు పంచాలి.. కానీ.. ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి.. సంపద పెంచుకోవాలనే ఆలోచన చేయటం దుర్మార్గమని అన్నారు. డిస్కమ్ లంటే డిస్టిబ్యూషన్ సంస్థలే తప్ప ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదని సూచించారు. విద్యుత్ అంటే వ్యాపారం కాదు.. రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రమని అన్నారు. విద్యుత్ సంస్థల బలోపేతం కోసం చేసే ఖర్చు భారం కాదని.. అది ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. అదనపు ఆదాయం కోసం.. 18 వేల కోట్ల అదనపు భారం మోపాలన్న కాంగ్రెస్ సర్కారు ఆలోచనే ప్రజా వ్యతిరేకమైనదని విమర్శించారు. విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన చార్జీలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని కోరారు. వివిధ కారణాలు చెప్పి 963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదని హితవు పలికారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా తక్షణం రూ. 12 వందల కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నపుడు పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదని కేటీఆర్ గుర్తుచేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్ట్ ఉచితంగా నీళ్లు ఇచ్చినప్పటికీ ఒక్క రూపాయి భారం వేయలేదని అన్నారు. ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉందని విమర్శించారు. ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. 11కేవీ, 33కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలకు సంబంధించి అన్నింటిన ఒకే కేటగిరీ లోకి తీసుకురావడం అసంబద్ధమని తెలిపారు. అదానీ ఒక ఫ్యాక్టరీ పెడితే వారికి వర్తించే కేటగిరీనే మా సిరిసిల్లలో సాంచాలు నడిపే పరిశ్రమకు ఉంచాలనుకోవటం హేతుబద్ధమైన నిర్ణయం కాదని అన్నారు. పరిశ్రమలకు సంబంధించి కరెంట్ ను అన్నింటిని ఒకే గాటున కట్టడమంటే సూక్ష్మ చిన్న, మధ్య పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లే అని అన్నారు. ఈ విధమైన కుట్ర చేస్తూ చిన్న పరిశ్రమలకు రాయితీ ఇవ్వకుండా ఉండే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడిందని.. చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయని తెలిపారు. ఇంకా ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రమలు బేంబేలెత్తిపోతాయని తెలిపారు. కుటీర, చిన్న, పెద్ద పరిశ్రమలను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిస్కంలు చేసిన ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 12 వందల కోట్లు భరించిందని.. ఈ ప్రభుత్వం ఎందుకు భరించదని కేటీఆర్ ప్రశ్నించారు. మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెచ్చినా తాము అంగీకరించలేదని తెలిపారు. 10 హెచ్ పీ వరకు సిరిసిల్ల నేతన్నలకు సబ్సిడీ ఇచ్చామన్నారు. నాయి బ్రాహ్మణులు, రజకులకు, ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత విద్యుత్ ఇచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. పదినెలలకే ఎందుకు ఛార్జీలు పెంచే ప్రయత్నం చేస్తున్నారని నిలదీశారు.

## నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశం

18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో పాల్గొనేందుకు జర్మనీ ఛాన్స్‌లర్ గురువారం భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీకి వచ్చారు. గురువారం అర్థరాత్రి వచ్చిన ఛాన్సలర్‌ను రాష్ట్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిత్యానంద రాయ్ కలుసుకున్నారు. అదే విధంగా శుక్రవారం ఢిల్లీలో జరగనున్న 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ సమ్మిట్‌లో ఇరువురు నేతలు పాల్గొన నున్నారు. ఈ కార్యక్రమంలో జర్మనీతో పాటు ఇతర దేశాల కు చెందిన వ్యాపారులు, అధికారులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన నున్నారు. అనంతరం జర్మీ ఛాన్స్‌లర్ గోవాకు వెళ్లనున్నారు. భారత్, జర్మనీలు 2000 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగిఉన్నట్లు భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

## హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రజాస్వామ్యంపై మాజీ సీఎం కేసీఆర్ కు నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ తనని తాను ఓ జమిందార్ గా భావిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రజలు ఎక్కువ రోజులు సహించరని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీకి, మాజీ సీఎం కేసీఆర్‌కి తాను ఒకటే మాట చెబుతున్నానని.. నిజంగానే అభివృద్ధి జరగాలని భావిస్తే తనతో మాట్లాడాలన్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని రాజకీయాలు చేయాలని, దాంతో అభివృద్ధికి ఏ ఆటంకాలు ఉండవన్నారు. తెలంగాణలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రం వ్యతిరేకిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

## సిజెఐగా జస్టిస్ ఖన్నా 11న ప్రమాణం

మేఘువాల్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. జస్టిస్ ఖన్నా 183 రోజులు మాత్రమే సీజేఐ ఉండనున్నారు. అంటే ఆయన కేవలం ఆరు నెలలు మాత్రమే ఈ పదవిలో ఉంటారన్నమాట. అతను మే 13, 2025న పదవీ విరమణ చేయనున్నారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి హన్స్ రాజ్ ఖన్నా మేనల్లుడు జస్టిస్ సంజీవ్ ఖన్నా జబల్‌పూర్ కేసులో ఇచ్చిన తీర్పుతో ఆయన ప్రసిద్ధి చెందాడు.

## పొంగులేటి బాంబుల వ్యాఖ్యలపై కెటిఆర్ స్పందన

### ఎలాంటి బాంబులకైనా భయపడేది లేదని వ్యాఖ్య

రాజన్నసిరిసిల్ల : దీపావళికి ముందే బాంబులు పేలుతాయన్న మంత్రి పొంగులేటి వయాఖ్యలపై స్పందించిన కేటీఆర్.. ఎవ్వరూ దీనికి భయపడరని అన్నారు. అయన పై జరిగిన ఈడి రైట్స్ కావచ్చని ఎద్దేవా చేశారు. లేదా సిఎ రేవంత్ రెడ్డి బావమర్దికి సంబంధించిన కేసులు కావన్నారు. ఎం చేస్తారో చేసుకోండని చెప్పారు. ఈ చిట్టి నాయుడు ఏం చేస్తాడని, చిల్లర కేసు పెట్టి జైలుకి పంపిస్తారు కావచ్చు అంతే అన్నారు. నిజమైన బాంబులకే భయపడలేదు, గీ సుతిల్ బాంబులకు భయపడతానా అని చెప్పారు. జగిత్యాల ఎంఎల్ఏ సంజయ్‌పై ఫైయ్యారు. ఆయనో రాజకీయ వ్యభిచారని విమర్శించారు. జగిత్యాలలో కాంగ్రెస్ నాయకులే ఒకరినొకరు చంపుకుంటున్నారని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల అరెస్టులు తప్పవని, త్వరలోనే బాంబులు పేలతాయంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి బాంబులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు, వైఎస్ఆర్ వంటి వారితోనే పోరాటం చేశామని.. మీరో లెక్కా అంటూ విరుచుకుపడ్డారు. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఏం పీక్కుంటారో పీక్కోండి.. నీ బాంబులకు భయపడలేదు. కేసులకు భయపడేది లేదు. మేం ఒరిజినల్ బాంబులకే భయపడలేదు. దొంగ కేసులు పెడితే పెట్టుకో. నీ ఈడీ కేసులు, మోడీ కాళ్ళు మొక్కిన బాంబుల గురించి చెప్పు. చంద్రబాబు, వైస్సార్‌తోనే కొట్లాడినం.. ఈ చిట్టి నాయుడు ఓ లెక్కనా. అడ్డమైన కేసులు పెట్టి జైలుకు పంపితే పంపు.. ఆర్ఆర్ టాక్స్‌లపై మేం వచ్చాక లెక్క తెలుస్తాం. సీఎం రేవంత్ బామ్మర్ది, పొంగులేటి బాగోతాలు అన్నీ బయటకు తీస్తాం. చావుకు మేం భయపడం అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం సిరిసిల్లలో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ విచారణకు ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. సియోల్ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతలు అరెస్ట్ అవడం పక్కా అని తెలిపారు. గత సర్కారులో కీలక నేతలను నవంబరు 1 నుంచి 8 వరకు అందరినీ అరెస్టు చేస్తామని ప్రకటించారు. త్వరలోనే బాంబులు పేలతాయన్నారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన ప్రముఖులకు సంబంధించిన ఫైళ్లు సిద్ధం అయ్యాయన్నారు. కుంభకోణాల్లో ఏదో ఒకటి దీపావళిలోపే టపాసులా పేలుతుందన్నారు. ఈనెల 26 లోపే కొన్ని బాంబులు పడతాయని మీడియా ప్రతినిధులతో చెప్పారు. అన్నింటికీ పక్కా ఆధారాలున్నాయని, ఎవరినీ వదిలిపెట్టబోమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం - రైతు ప్రభుత్వం

- ధాన్యంలో కోతలు విధిస్తే తాటాతీస్తాం
- ఈ సీజన్ నుండే సన్న రకం పంటకు రూ. 500 బోనస్
- ఎన్నికలలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం
- సింగల్ విండో, ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పెద్దపల్లి చింతకుంట విజయరమణ రావు





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులకు ఏ కష్టం వచ్చినా కళ్ళల్లో పెట్టి చూసుకుంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని జూలపల్లి మండలం పెద్దాపూర్, తేలుకుంట, నాగులపల్లి, చీమలపేట గ్రామాలలో, ఎలిగేడు మండల కేంద్రంలో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వమని ఆరుగాలం కష్టపడి తన రెక్కల కష్టంతో ఎందరో ఆకలి తీర్చే అన్నదాతకు అన్యాయం జరవద్దని అన్నారు. రైతును కష్టపెట్టిన ఎ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడలేదని గత పాలకుల చేతిలో రైతన్నలు చాలా నష్టపోయారని తెలిపారు. గతంలో మాదిరిగా రైతన్నలను ఇబ్బందులకు గురిచేస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రైతులు పండించిన పంట విషయంలో ఎలాంటి కోతలు విధించకూడదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఎమ్మెల్యే విజయరమణ రావు ఆదేశించారు.

ఒకవేళ ధాన్యంలో కోతలు చేస్తున్నారని మా దృష్టికి వస్తే 24 గంటలకు గడవకముందే వారి బాధ్యతల నుండి తొలగించి నూతనంగా ఇతరులను చేర్చడం జరుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో ఎవరి మాటా వినబోమని స్పష్టం చేశారు. రైతులు తమకు ఎలాంటి ఇబ్బందులూ వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ఈ సీజన్ నుండే సన్న రకం పంటకు రూ. 500 బోనస్ అందించడం జరుగుతుందని అన్నారు. రైతు తన ధాన్యం అమ్మకం జరిపిన వెంటనే రెండు లేదా మూడు రోజుల్లోనే తమ పంట డబ్బులను రైతు ఖాతాలలోని జమ చేయడానికి ప్రభుత్వం పకడ్బందీ

చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్ మరియు సింగిల్ విండో చైర్మన్లు పుల్లూరి వేణుగోపాల్ రావు ,గోపు విజయ్ భాస్కర రెడ్డి , తహసిల్దార్ ,ఏపీఎం, ఎంపివో, ఎలిగేడు మండల అధ్యక్షులు సమా రాజేశ్వర్ రెడ్డి , సంతోష్ రావు,జూలపల్లి మండల అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీ లు , రైతులు, హామాలీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌లో

# ఘనంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

### కమీషనరేట్ పోలీసు హెడ్ క్వార్టర్స్ నుండి సైకిల్ ర్యాలీ ప్రారంభించిన పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి



**కరీంనగర్ టౌన్, అక్టోబర్25(ది క్రైమ్ న్యూస్):** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ పోలీసు కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ నుండి సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ, సమాజంలో శాంతిభద్రతల స్థాపనకు పోలీసులు చేస్తున్న కృషిపట్ల ప్రజలకు అవగాహన కలిగే విధంగా ఈ సైకిల్ ర్యాలీ ఉపయోగ పడుతుందని భావిస్తున్నామన్నారు.

కమీషనరేట్ లోని అన్ని విభాగాలకు చెందిన పోలీసు అధికారులతో పాటు నగరంలోని పలువురు సభ్యులు పెద్దసంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నా రన్నారు. పోలీస్ హెడక్వార్టర్స్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టాండ్ ఇన్ గేట్, ఇందిరా చౌక్, రాంనగర్ పాత లేబర్ అడ్డా మీదుగా, శివ థియేటర్ జంక్షన్, కెమిస్ట్రీ భవన్ మీదుగా, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్, త్రీ టౌన్ మీదుగా కమాన్ చౌరస్తా, వన్ టౌన్ పోలీసు స్టేషన్ తిరిగి బస్ స్టాండ్ మీదుగా పోలీసు హెడ్ క్వార్టర్స్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏ ఆర్) అనోక్ జయ్ కుమార్ లతో పాటు ఏసీపీలు విజయ్ కుమార్ , మాధవి , నరేందర్ , వెంకటరమణ, కమిషనరేట్ లోని ఇన్స్పెక్టర్లు కోటేశ్వర్ , విజయకుమార్, జాన్ రెడ్డి, స్వామి , ప్రకాష్ గౌడ్ , రిజర్వు ఇన్స్పెక్టర్లు రజినీకాంత్, కుమార స్వామి, జానీమియా , శ్రీధర్ రెడ్డి, సురేష్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో, ప్రస్తుత డివిజన్లో

# తాగునీటి సమస్యను పరిష్కరించండి

### మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించిన కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్, అక్టోబర్25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థల్లో విలీనమైన గ్రామాల్లో , ప్రస్తుత ఆయా డివిజన్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఒకటో డివిజన్ బిజెపి కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో విలీనమైన ఆయా డివిజన్లలో తాగునీటి అవసరాలకు సంబంధించి పైపులైన్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా రనీ తెలిపారు. కరీంనగర్ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం , మంచినీటి పైపులైన్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా 149 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు . కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో విలీన గ్రామాలలో, ప్రస్తుత డివిజన్లలో కొత్తగా వాటర్ ట్యాంకులు, ప్రతి వీధిలో కొత్తగా పైప్ లైన్ల పనులను ప్రారంభించా లన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేసి సంవత్సర కాలం కావస్తుందని, , కానీ ఇంతవరకు విలీన గ్రామాలలో మంచినీటి పైపులైన్ పనులనుప్రారంభించలేదన్నారు రాబోయే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని తాగునీటి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా మంజూరు అయిన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టి , అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. వీలిన గ్రామాల్లో , ఆయా డివిజన్ పరిధిలో ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ను ఆయన ఈ సందర్భంగా కోరారు.

### శాతవాహన ఉపకులపతి ఉమేష్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిసిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్



**కరీంనగర్ టౌన్, అక్టోబర్25(ది క్రైమ్ న్యూస్):** శాతవాహన ఉపకులపతిగా నియమితులై బాధ్యతలు నిర్వహించిన ఉమేష్ కుమార్ ను వారి చాంబర్ లో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పోరేటర్ సాదవేణి శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, శాతవాహన యునివర్సిటీ విద్యార్థి ఐ.క.స అధ్యక్షుడు చైతన్య తదితరులతో కలిసి వారికి పుష్పాగుచ్ఛం అందజేసి సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ శాతవాహన యునివర్సిటీలో మరిన్ని డిపార్ట్మెంటు వచ్చే విధంగా ప్రయత్నం చెయ్యాలని, దానిని నగర పౌరులుగా అందరం సహాకరిస్తాము అని శాతవాహన యునివర్సిటీ మన కరీంనగర్ జిల్లా ఎంతో తలమానికం వంటిది, తెలంగాణ ఉద్యమం సమయంలో అన్ని యునివర్సిటీలతో పాటు శాతవాహన యునివర్సిటీ పాత్ర కూడ కీలకం అని వారు అన్నారు.వారితో నైతం మహేష్, అరుణ్, బండ అనీల్ తదితరులు ఉన్నారు

### భూ సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు

#### అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్)** మండలంలో పెండింగ్ ఉన్న భూ సమస్యల పరిష్కారానికి పొగడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ రామగుండం మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులు వివరాలు తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. మీసేవ కేంద్రాలకు ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సకాలంలో వాటిని జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ ఆక్ట్ రికవరీ ఫైల్స్ సమీక్షించిన అదనపు కలెక్టర్ వాటిపై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో తహసిల్దార్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు డివైడర్ నిర్మాణ పనులను పరిశీలించిన పీ.ఏ.సి చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**కూకట్ పల్లి అక్టోబర్ 25 (ది క్రైమ్ న్యూస):** కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీ లోని మెయిన్ రోడ్ లో ఆర్.సి.సి గ్రిల్స్ తో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు డివైడర్ నిర్మాణ పనులను పి.ఏ.సి కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గురువారం అర్ధరాత్రి అకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నాణ్యత తో పనులు చేయాలని కోరుతూ కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేసారు. పనుల పరిశీలనలో ఎమ్మెల్యే గాంధీ తో పాటు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి, జి. ప్రసాద్, మాధవ్, నిఖిల్, వర్క్ ఇన్స్పెక్టర్ గురువారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం అర్ధరాత్రి వరకు ఎమ్మెల్యే గాంధీ పనిచేస్తున్నారని, అందుకు తాము ఎమ్మెల్యే గాంధీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ రోజుల్లో ప్రజల కష్టాలు తెలుసుకొని వాటిని పరిష్కరించే పనులు చేయించడం ఎంతో సంతోషంగా, గొప్పగా ఉందని పురంధర్ రెడ్డి ఎమ్మెల్యే గాంధీ ని కొనియాడారు.

### నవంబర్ 1న స్థానిక సంస్థల్లో వెనుక బాటుతనంపై ప్రజాభిప్రాయ సేకరణ - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** నవంబర్ 1న స్థానిక సంస్థల్లో వెనుక బాటుతనం పై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని, దీనిలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, మేధావులు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థలలో వెనుకబాటుతనం స్వభావం ప్రభావాన్ని సమకాలిన, సున్నమైన అనుభ పూర్వక విచారణను నిర్వహించేందుకు ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, నవంబర్ 1 న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియ హాల్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు కుల సంఘాలు, సంచార జాతుల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని, ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలను, అభ్యర్థనలను రాతపూర్వకంగా వెరిఫికేషన్ ఆఫ్ డేవిడ్ తో పాటు 6 సెట్లలో తెలుగు లేదా ఆంగ్లం ఏదైనా భాషలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ గారికి సమర్పించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# సంపాదకీయం

## సమగ్ర వ్యవసాయ విధానమేశరణ్యం

ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడం వదిలేసి కేవలం ఉచిత పథకాలతో వారిని బుట్టలో వేసుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. సమగ్ర వ్యవసాయ విధానాలు రూపొందించడంలో పాలకులు ఎప్పటి కప్పుడు విఫలం అవుతూనే ఉన్నారు. ఇలా ఎన్నాళ్లు చేసిన ప్రయోజనం శూన్యమని తేలింది. రైతుబంధు, రైతు రుణమాఫీ అన్నది కేవలంతాతా÷-కాలిక లేపనం తప్ప మరోటి కాదు. ఇలా చేస్తూ పోతే ఖజానా గుల్లవ్వడం తప్ప రైతులు బాగు పడరు. అలా బాగుపడివుంటే ఈ పాటికి రాజులయ్యేవారు. అలా కాకుండా నిపుణులతో చర్చించి వారి సమస్యలను ఎజెండా చేసుకుని ముందుకు సాగాలి. నిజానికి రైతులకు కావాల్సింది ఇలాంటి తాయిలాలు కావని గుర్తించాలి. ముందుగా సాగునీట సమస్యను పరిష్కరించాలి. నీరు అందుబాటులో లేకుంటే కమ్యూనిటీ బోర్ల ద్వారా నీటిని అందించాలి. చెరువులు, కుంటలను బాగు చేయాలి. కాలువలను మరమ్మత్తులు చేయాలి. నదుల నుంచి నీరు చెరువల్లోకి వచ్చేలా చేయాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇకపోతే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి. ఏ పంటలు వేయాలో..ఏ భూమిలో ఏ పంటలు పండిస్తే మంచిదో ముందే తెలియచేయాలి. రైతులను కమిటీలుగా ఏర్పాటు చేసి వారు సమిష్టి వ్యవసాయం దిశగా అడుగులు వేసేలా చేయాలి. వారు వేసే పంటలను సకాలంలో మద్దతు ధరలు చెల్లించి కొనుగోలు చేయాలి. లేదా అందుకు తగ్గట్లుగా మార్కెట్‌ను కల్పించాలి. పంటలకు అవసరమైన రుణాలను తక్కువ వడ్డీలకు లేదా వడ్ఈలేని రుణాలను అందించాలి. ఉచిత కరెంట్‌ను కూడా అవసరమైన మేరకు మాత్రమే వినియోగించేలా నియంత్రణ చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటలకు వెంటనే పరిహారం అందించేలా బీమా సదుపాయం కల్పించాలి. ఇవన్నీచేయడం ద్వారా రైతులను ఆదుకోవచ్చు. అభివృద్ధి చేయవచ్చు. ఇప్పుడు వ్యవసాయానికి చేస్తున్న ఖర్చులను విభజిస్తే ఇవన్నీ సాకారం అవుతాయి. అలాగే పంటలు పండించే రైతులకు దీని ద్వారా నేరుగా మేలు జరుగుతుంది. పంటలు వేయని, పండిచని రైతులకు ఇవన్నీ వర్తించకుండా చూడాలి. నిజమైన రైతులకు ప్రయోజాలను కల్పించిన వారం అవుతాం. కానీ ఓటు బ్యాంక్‌కు అలవాటు పడ్డ పాలకులు, ఎంతసేపు రైతుబంధు, రుణమాఫీ అంటూ గోల చేస్తున్నారు. ఉచితవిద్యుత్, రైతుబంధు ద్వారా పంట పెట్టుబడి, సాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నా రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. పంటల కోసం తెగ అప్పులు చేసి, ఆ తరవాత తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఆత్మహత్యకు పాల్పడిన ఒక్కో రైతుకు సగటున రూ.3 నుంచి రూ. నాలుగున్నర లక్షల అప్పు, 5 ఎకరాల్లోపు భూములు ఉన్నట్లు గుర్తించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో 92శాతం మంది కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమా యోజనలో చేరలేదని తెలుస్తోంది. 47శాతం మంది రైతులు ఆత్మహత్యలు అప్పుల వల్లనే చేసుకుంటున్నట్లు ఎన్ఐఆర్‌డీపీఆర్ గుర్తించింది. రైతుల ఆదాయం తగ్గిపోయిందని, వేలల్లో ఆదాయం ఉంటే లక్షల్లో అప్పులు ఉండడం వల్లనే ఒత్తిడిలు భరించలేక అప్పుల పాలవుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు జరుగు తున్నట్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ గుర్తించింది. నవంబర్, ఏప్రిల్, మే నెలల్లో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. రుణ మాఫీలు సరిగా జరగకపోవడం, దీనిపై సరైన నిర్ణయం లేకపోవడం వల్ల రైతుల్లో తీవ్రమైన అసంతృప్తి, ఆందోళన నెలకొంటుంది. దీనికి తోడు జిల్లాల్లో కౌలు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కౌలు రైతుల్లో సగం మంది అప్పులపాలై ఆందోళన చెందుతున్నారు. వీరికి కనీసం రైతుబంధు లాంటి స్కీములు కూడా అమలు చేయకపోవడం వల్ల వారు అసంతృప్తితో ఉన్నారు. సాగుభూమి ఎప్పటికప్పుడు తగ్గిపోవడం, కమతాలు చిన్నవిగా ఉండడం, వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. సాగు చేస్తున్న పంటలకు ఆశించిన ధరలు రాకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. రైతుల అవసరాల మేరకు బ్యాంకులు రుణాలు అందించడం లేదు. దీంతో వడ్డీ వ్యాపారస్తుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. తీరా అప్పులు తీర్చలేక వారు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ రుణమాఫీ పథకం అమలు చేస్తున్నప్పటికీ విడతల వారీగా బ్యాంకుల్లో జమ చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. 55 నుంచి 60 శాతం మంది రైతులు బ్యాంకుల నిబంధనలు భరించలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అత్యధిక వడ్డీలు చెల్లించి అప్పులను తీసుకుంటున్న దాఖలాలున్నాయి. ఇకపోతే ధాన్యం కొనుగోళ్లు ఒక ఎత్తయితే తడిసిన ధాన్యం కొనడం మరో ఎత్తు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యంతో రైతులు లబోదిబోమంటున్నా..పాలకులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ధాన్యం తడవడంతో పాటు పంటలు చాలావరకు నీటమునుగుతున్నాయి. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సకాలంలో రంగంలోకి దిగడంలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా తడిసిన ధాన్యంతో రైతులు లబోదిబో మంటున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నా ఆదుకునే వారు,సమాధానం చెప్పడం లేదు. ధాన్యం కొనుగోళ్లలో శ్రద్ధ చూపని పాలకులు కిలో రూపాయి బియ్యం విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం పక్కదారి పడుతోంది. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించకుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకలి. నిజానికి ఈ డబ్బులతో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొంటే కొంత ఊరట కలిగేది. ధాన్యం కొనడం వల్ల ఎంత ఖర్చవుతుందో అంత లెక్క కట్టి ఆ మేరకు బియ్యం పథకం ధరలను పెంచాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. ఈ క్రమంలో సమగ్రవ్యవసాయ విధానంపై కసరత్తు చేయాలి. వ్యవసాయరంగ నిపుణులను, అనుభవమున్న రైతులను సమీకరించి సమగ్రంగా చర్చించాలి. అప్పుడే వ్యవసాయాన్ని పండగ చేయవచ్చు.

# నౌక ఢీకొనడంతో కూలిన బాల్టిమోర్ వంతెన



## రూ.840 కోట్లు

### చెల్లించేందుకు అంగీకారం

న్యూయార్క్ : అమెరికాలోని బాల్టిమోర్‌లో నౌక ఢీకొనడంతో ఓ వంతెన కూలి పోయింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఈ ఘటనపై కార్గోషిప్‌కు చెందిన యజమానితో రూ.840 కోట్ల నష్టపరిహారం చెల్లింపునకు ఒప్పందం జరిగినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. 'ఆరుగురి ప్రాణాలు బలిగొనడంతో పాటు భారీ నష్టాన్ని కలిగించిన ఈ ఘోరమైన ఘటనకు దాదాపు ఏడు నెలల తర్వాత పరిష్కారం లభించింది. మేము ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాం. గ్రేస్ ఓషన్ ప్రైవేట్ లిమిటెడ్, సినర్జీ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా 101.1 మిలియన్ డాలర్లు (రూ.840 కోట్లు) చెల్లించేందుకు అంగీకరించాయని న్యాయశాఖ అధికారి బెంజమిన్ మిజర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన పునర్నిర్మాణానికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఈ ఒప్పందంలో చేర్చలేదని న్యాయశాఖ వెల్లడించింది. ఇది మేరీల్యాండ్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక దావా అంశమని పేర్కొంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కార్మికుల కుటుంబాలు దాఖలు చేసిన పిటిషన్లపై వాదనలు కొనసాగుతున్నట్లు తెలిపింది. నౌక ఢీకొనడంతో పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన కుప్పకూలిన విషయం తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం.. మార్చి 25న అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఆ సమయంలో నౌకలో భారత సిబ్బంది సైతం ఉన్నారు. అయితే, ప్రమాదానికి ముందే వారు అధికారులను అప్రమత్తం చేయడంతో వంతెనపై రాకపోకలను నిలిపివేయ గలిగారు. దీంతో భారీస్థాయి ప్రాణనష్టం తప్పిందని అప్పట్లో అధికారులు వెల్లడించారు.

# ఒడిషాలో తీరం దాటిన దానా తుఫాన్



**తీరం వెంట 120 కి.మీ వేగంతో గాలులు**

**గాలుల ధాటికి పలుచోట్ల నేలకూలిన చెట్లు**

**తీరప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు**

విశాఖపట్టణం : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని బిత్తర్‌కనిక జాతీయ పార్క్, ధమ్రా మధ్య గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ పక్రియ ప్రారంభమైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం ఉదయం వరకు ఇది కొనసాగి తుపాన్ బలహీనపడనుంది. తుపాను తీరం దాటే సమయంలో భద్రక్, కేంద్రపార జిల్లాల్లో గంటలకు 120 కి.మీ వేగంతో తీవ్రంగా గాలులు వీచాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. తుపాన్ ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విద్యా సంస్థలకు శుక్రవారం సెలవు ప్రకటించాలని అధికారులు రెండు రాష్ట్రాలకు సూచించారు. కోల్‌కతా, భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌ను గురువారం సాయంత్రం శుక్రవారం 9 గంటల వరకు మూసి ఉంచనున్నారు. రెండు రాష్ట్రాల్లో మొత్తం 400 రైళ్లను రద్దు చేశారు. అధికారులు తుపాను ప్రభావితమయ్యే ప్రాంతాలను నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పక్రియ చేపట్టారు. తీవ్ర తుఫాన్ దానా .. శుక్రవారం తెల్లవారు జామున పూరి సమిపంలోని ధమ్రా- హబలి ఖాతి మధ్య ప్రాంతంలో తీరాన్ని దాటింది. దీంతో ఈ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంటకు వంద నుంచి నూట ఇరవై కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాళ్లు తీరం దాటి సమయంలో వీస్తున్నాయి. ఇప్పుడు పశ్చిమ వాయువ్య దిశగా కదులుతుంది... ఇది క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర ఒరిస్సా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో ఉత్తరకొస్తా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కూడా అక్కడక్కడ వర్షాలు పడడానికి ఆస్కారం ఉంది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ.. హబాలి ఖాతి నేచర్ క్యాంప్, ధమ్రాకు సమీపంలో తుపాన్ 'దానా' తీరం దాటిందని, రాత్రి 1:30 గంటల నుంచి శుక్రవారం తెల్లవారు జాము 3:30 గంటల మధ్య తీరం దాటిందన్నారు. ల్యాండ్‌ఫాల్ పక్రియ మరో 2-3 గంటల పాటు కొనసాగుతుందని, ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మధ్యాహ్నం నుంచి క్రమంగా బలహీన పడుతుందని, ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోణంకి కూర్మనాథ్ సూచించారు. మరోవైపు దానా తుపానుతో రాష్ట్రానికి ముప్పు తప్పింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం పశ్చిమ వాయవ్యంగా పయనించి బుధవారం నాటికి తుఫాన్‌గా బలపడింది. తరువాత వాయవ్యంగా గంటకు 12 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ రాత్రి 10 గంటలకు ఒడిసాలోని పారాదీప్‌కు 420 కి.మీ, ధామ్రాకు 450 కి.మీ, సాగర్ ద్వీపానికి (పశ్చిమ బెంగాల్) 500 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీనికి ఒమన్ దేశం సూచించిన 'దానా' అని పేరు పెట్టారు. తుఫాను వాయవ్యంగా పయనించే క్రమంలో తీవ్ర తుఫాన్‌గా బలపడి ఈరోజు ఉదయానికి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఈ క్రమంలో తీవ్ర తుఫాన్ ఒడిసాలో తీరం దాటిన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు ముప్పు తప్పింది. తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్రలో పలుచోట్ల చెదురుమదురు వర్షాలు మాత్రమే కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున ఈనెల 26 వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవులలో రెండో నంబరు హెచ్చరిక ఎగురవేశారు. కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవులకు సమాచారం అందించారు.

# దంతేరాస్ రోజు.. బంగారమే కొనాలని లేదు

### తమలపాకులతోనూ లక్ష్మీదేవినిపూజించవచ్చు

ముంబై : ధన్ తేరాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందరికీ ఈ పండుగ గురించి తెలుసు. ధంతేరాస్ రోజు ధన్వంతరీని పూజిస్తారు. ధన్వంతరీని పూజించడం వల్ల ఆర్థిక కష్టాలు, అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్న నమ్మకం. ఈ ధంతేరాస్ నుంచే దీపావళి పండుగ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది అక్టోబర్ 29న ధంతేరాస్ వస్తుంది. ఈ రోజున చాలా మంది బంగారం, వెండి ఆభరణాలను కొనుగోలు చేస్తారు.బంగారం, వెండి వస్తువులు, ఆభరణాలను కొనలేని వారు కూడా ఉంటారు. అలాంటి వారు ఇప్పుడు చెప్పే వాటిని కొన్నా చాలా మంచిదని, ఆర్థికంగా బలపడతారని పండితులు చెబుతారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఇంట్లో ఎలాంటి శుభకార్యాలను తలపెట్టినా తమలపాకులను ఉపయోగిస్తూ ఉంటారు. తమల పాకులను లక్ష్మి దేవి స్వరూపంగా కూడా భావిస్తారు. ధంతేరస్ రోజున తమల పాకులు కొని లక్ష్మి దేవికి నైవేద్యంగా పెడితే.. ఆ జగన్మాత ఆశీస్సులు లభిస్తాయని అంటారు. ఆ తర్వాత రోజు వాటిని ఓ పవిత్ర నదిలో వదిలేయడం మంచిది. అలాగే కొత్తిమీర కొని ఇంటికి తీసుకొచ్చినా కూడా చాలా మంచిది. కొత్తి మీరను కూడా సంపదకు చిహ్నంగా భావిస్తారు. కాబట్టి ఈ రోజున కొత్తిమీరను కొంటే డబ్బుకు లోటు ఉండదు. పసుపు, కుంకుమలు అమ్మవారికి ప్రీతికరంగా భావిస్తారు. కాబట్టి ధంతేరాస్ రోజున పసుపు, కుంకుమ కొని ఇంటికి తీసుకురావచ్చు. దీని వలన స్త్రీలకు వైవాహిక జీవితం సంతోషంగా ఉంటుంది. అదృష్టాన్ని కూడా తెచ్చిపెడుతుంది. ధంతేరస్ రోజున చీపుర్లు కొంటే చాలా మంచిది. ఎందుకంటే చీపురును లక్ష్మి దేవితో సమానంగా భావిస్తారు. ఆ రోజున చీపురు కొని ఇంటికి తీసుకొస్తే.. ఐశ్వర్యం, అదృష్టం కలిసి వస్తుందట. ఇంట్లో గొడవలు కూడా తగ్గుతాయి. పేదవారికి చీపుర్లు, చెప్పులు, గొడుగులు కొని ఇచ్చినా మంచిదే. ధంతేరాస్ రోజు ఉప్పు కొన్నా చాలా మంచిది. ఉప్పును కూడా ఎంతో పవిత్రంగా చూస్తారు. బంగారం,వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ వాటిని కొనాలన్న నిబంధన ఏదీ లేదని కూడా అంటున్నారు. వ్యాపార ప్రకటనల మోజులో పడి ఇల్లు గుల్ల చేసుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

# కర్మాచరణేఉత్తమోత్తమం

'అర్జునా! శాస్త్రం విధించిన కర్మలను విధిగా ఆచరించు. కర్మలను ఆచరించకుండుట జడత్వం. జడతకన్నా కర్మాచరణ ఉత్తమం. శరీర పోషణకైనా కర్మాచరణ అవసరం' అని చెబుతున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ. అభిప్రాయాలేవీ లేకుండా జనించిన మనం, వయసుతోపాటు అభిప్రాయాలను, ఊహలను పెంచుకుంటూ అపరిమిత జీవితాన్ని పరిమితం చేసుకుంటాం. ప్రతి వ్యక్తి జీవితానికీ ఒక ప్రయోజనం ఉంటుంది. ప్రయోజన భరితమైన ఆలోచనలు ఉన్నతస్థితికి చేరేందుకు సహకరిస్తాయి. క్షత్రియుడిగా అర్జునుడి జీవన ప్రయోజనం ధర్మాన్ని నిలపడం. కానీ, వ్యామోహాత్ముడైన అర్జునుడు, వ్యవస్థ ప్రయోజనాన్ని పణంగా పెట్టి ప్రయోజన భంగకరమైన ఆలోచనలను చేస్తూ ట్కక్లైబ్యత్వాన్ని ఆశ్రయించాడు. మనసును, శరీరాన్ని ఏకోన్ముఖం చేసి పరిశ్రమించాల్సిన సమయంలో చాపల్యంతో నిర్దేశిత కర్మను చేయననడాన్ని మలినమైన భావనలకు ప్రతీకలుగా చెప్పుకోవాలి. శరీరం, మనసు, ఉపకరణం, ప్రక్రియ, అదృష్టం..ఈ అయిదు వ్యక్తి చేసే కర్మల ఫలితాలకు కారణాలు అవుతాయి. మనమంతా 'నేను చేస్తున్నాను' అనే భావనతో, కర్మఫలితాలకు బాధ్యులం అవుతున్నాం. భౌతిక జీవితంలో గృహస్థుగా భార్యాపిల్లల పోషణ, కార్యాలయాలలో అప్పగించిన బాధ్యతలు శ్రద్ధగా నిర్వహించడం శాస్త్ర విహిత కర్మలు. సమాజం వ్యక్తికి జీవనాధారమై నిలుస్తుంది. కాబట్టి సామాజిక బాధ్యతను నిర్వహించడం కర్తవ్యం. అందుకే చేయవలసిన కర్మలను బంధాలుగా భావించడం తప్పవుతుంది.



ఆధ్యాత్మికం

# అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలి: గవర్నర్ విష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్: అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికి ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో ఉన్న నిరుపేద గిరిజనులకు అందేందుకు, తద్వారా మెరుగైన జీవితాలను అందించేందుకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు అయన భద్రాద్రి కొత్తగూడెం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన గవర్నర్ కు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు బలరాం నాయక్, కొత్తగూడెం, భద్రాచలం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి. రాహుల్ , ఎస్పీ రోహిత్ రాజ్,అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖులతో సమావేశ మందిరంలో ముఖాముఖి సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా ప్రాముఖ్యతను, సంస్కృతి, సంప్రదాయాలను, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ కు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమని, ఇందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలలో, ఆదివాసి గిరిజన గ్రామాలలోని గిరిజన కుటుంబాలకు రక్తహీనత నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 481 గ్రామపంచాయతీలు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషమని, స్వచ్ఛభారత్ అనేది ఒక కార్యక్రమం కాదని, ఇదొక ఉద్యమమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, గిరిజన కుటుంబాలను భాగస్వామ్యం చేయాలని, ప్రత్యేకించి భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాలోని ప్రజలను దారిద్రరేఖ నుండి పైకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రచయితలు, కళాకారులు అందర్నీ భాగస్వాములు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.శభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు అలాగే ఆదివాసి గిరిజన మహిళలు తయారుచేసిన గిరిజన వంటకాలు చాలా బాగున్నాయని, భవిష్యత్తు అభివృద్ధి మహిళా సాధికారత పై ఆధారపడి ఉందని, ఈ విషయం తాను కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన సందర్భంగా సహాయక మహిళలు, గిరిజన మహిళలు వారు తయారు చేసిన చేతి వృత్తుల ప్రదర్శన, వంటకాలలో గుర్తించానని చెప్పారు. అలాగే స్వయం శక్తితో ఉపాధి కల్పించుకొని విజయాలు సాధించిన మహిళలు, గిరిజన మహిళల గురించి సమాజానికి తెలియజేయాలని అప్పుడే ఇతరులు వారిని స్ఫూర్తిగా పొంది అభివృద్ధి చెందుతారని అన్నారు . మహిళల చేతుల్లో డబ్బు ఉన్నప్పుడు ఆర్థిక సాధికారత వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న జీవన పరిస్థితుల మెరుగు కోసం కృషి చేయడం చాలా ముఖ్యమని, సమాజంలో ఉన్న చివరి మనిషి వరకు అభివృద్ధి ఫలాలు చేరాల్సిన అవసరం ఉందని అన్నారు .దేశంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యం అయితే వికసిత్ భారత్ సాధ్యమన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యం, విద్య రంగాలను పరిశీలిస్తే మెరుగైన స్థానంలో ఉన్నాయని, ప్రత్యేకించి విద్యలో 2024లో పదో తరగతిలో 90.6% గిరిజన సంక్షేమ శాఖ గిరిజన విద్యార్థులు పదో తరగతిలో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లో విద్యతోపాటు, చిన్న చిన్న



చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీ, చిన్న చిన్న పరికరాల వంటివి తెలియజేస్తే వారు ఇంకా విజ్ఞానవంతులు కావడానికి అవకాశం ఉందని అన్నారు. అలాగే ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయడం ద్వారా వారు ఎక్కువ జ్ఞానాన్ని పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. 2047 నాటికి ఇండియా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని ఆయన ఆకాంక్షించారు. సమాజం అంటే సంపద కాదని, సమాజం అంటే సంస్కృతి అని ఆయన చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నదులు, అటవీ సంపద, బిపిఎల్, కె టి పి ఎస్, జెన్కో, భారత్ జల నీటి శుద్ధి కర్మాగారం, సింగరేణి గనులు ఉన్నాయని, నిరుద్యోగులైన అన్ని వర్గాల యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే జీవనోపాధి



పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. భద్రాచలం, పర్ణశాల లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాల పరంగా పర్యాటక శాఖను అభివృద్ధి చేసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని, విద్య, ఆరోగ్యం, కల్చరల్ , వ్యవసాయం ఉపాధి అవకాశాలలో జిల్లాకి జిల్లాకి మధ్య పోటీ తత్వం ఉంటే అభివృద్ధి అనేది తప్పనిసరిగా సాధ్యమవుతుందని ముఖ్యంగా గిరిజన గ్రామాలలో నివసిస్తున్న మారుమూల ప్రాంత కొండ రెడ్ల గిరిజన విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కొండరెడ్ల కుటుంబాల అభివృద్ధికి పాటుపడాలని, జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత గిరిజన రైతులే కాకుండా ఇతర రైతులు కలానుగుణంగా పంటలు పండించుకొని వృద్ధి లోకి రావాలని అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్న అధికారులు ముఖ్యంగా గిరిజన గ్రామాలలో కావలసిన మౌలిక సదుపాయాలు విద్యా వైద్యం వ్యవసాయం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే తప్పనిసరిగా గిరిజనులు అభివృద్ధిలోకి వస్తారని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో వైద్యశాలలు బాగా పనిచేయాలని, మారుమూల ప్రాంతాలలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను సక్రమంగా నడిచే విధంగా చూడాలని అన్నారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా కావాలని అన్నారు. జిల్లా అభివృద్ధి గురించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ వివరించిన విధానము చాలా బాగుందని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లాలోని ముఖ్యమైన దేవాలయాలు, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం ,విద్య, వ్యవసాయం, ఉద్యానం, సంక్షేమం ,నీటిపారుదల, విద్యుత్, పౌర సరఫరాలు, గిరిజన సంక్షేమం, తదితర ముఖ్యమైన శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన పలువురు ప్రముఖులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, అడ్వకేట్లు వారి వారి రంగాలలో చేసిన కృషిని రాష్ట్ర గవర్నర్ తో పంచుకున్నారు. డాక్టర్ ప్రభు డేనియల్ రచయిత, సీతా ప్రసాద్ క్లాసికల్ డాన్సర్, వెంకటయ్య ఔషధ మొక్కల పెంపకం, కొండా విజయ్ కుమార్ సినిమా దర్శకుడు, ఎన్ రాజశేఖర్ ఉత్తమ తోట యజమాని, పశువుల అంజన కుమార్ ఆర్టిస్ట్, ఉయ్కే వెంకటలక్ష్మి శానిటరీ నాప్కిన్ మరియు మిల్లెట్ తయారీ తయారీ యజమాని, మోడం వంశీ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్, ఏ శంకర్ గాయకుడు, వి కొండలరావు గాయకుడు, డాక్టర్ బుచ్చయ్య గాయకుడు, %u%.శ్రీ తేజ నేషనల్ అథ్లెటిక్ బ్రౌన్స్ మెడల్, బట్టు శ్వేత వెయిట్ లిఫ్టింగ్, శ్రీరామ్ శెట్టి కాంతారావు పద్య రచయిత, ఆంగోతి శ్రీనివాసరావు పద్య రచయిత, పి రోశయ్య చౌదరి గాయకుడు, వెంగళ భాస్కర్ పాటల రచయిత, బి రిత్విక శ్రీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఎస్ సీత రచయిత మరియు కవి, స్నేహ జానపద గాయని, ఎస్ ప్రభాకర చార్యులు రచయిత మరియు కవి, కే దుర్గా చారి రచయిత మరియు కవి, తురిమెళ్ళ కళ్యాణి రచయిత మరియు కవి, ఎస్ కృష్ణమూర్తి రచయిత, నాగరాజశేఖర్ రచయిత, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరఫున రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కవులు రచయితలు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేష్ శ్యామ్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,కొత్తగూడెం ఆర్డీవో మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, మరియు జిల్లా అధికారులు ఐటిడిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అబద్దాల పుట్ట నోరు అదుపులో పెట్టుకో

## పుట్ట మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన సూర సమ్మయ్య

**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్) :**సూర సమ్మయ్య మాట్లాడుతూ బి ఆర్ ఎస్ హయాంలో ఇసుక లారీ లను హైదరాబాద్ కు పంపించి దందా నడిపి కోట్ల రూపాయలు సంపాదించిన నువ్వు శ్రీధర్ బాబు ని విమార్శించడం సరికాదు. అడ్డు వచ్చిన వారిని విచక్షణ రహితంగా నరికి చంపిన మీరా మంత్రి ని విమర్శించేది అని అన్నారు. మీ పార్టీ అధికారం లో ఉన్నప్పుడు శాండ్ రీచ్ అనే వ్యవత్సను నాశనం చేసిన మీరా శ్రీధర్ బాబు ను విమర్శించేది. శ్రీధర్ బాబు అభివృద్ధి పదం లో అటు రాష్ట్రాన్ని, ఇటు పెద్దపల్లి జిల్లాను మంథని నియోజక వర్గాన్ని అభివృద్ధి పరంగా నడిపిస్తున్న ఏకైక మంత్రి శ్రీధర్ బాబు. అందుకే నీ కండ్లు ఓర్వలేకనే మంత్రి మీద అబండలు చేస్తున్నావ్ అని అన్నారు. ఖబడ్దర్ ఇంకో సారి మా మంత్రి గురించి కానీ వారి తమ్ముడైనా శ్రీను బాబు గురించి మాట్లాడితే ఖబడ్దర్ అని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బామ్లా నాయక్ తండా మాజి సర్పంచ్ లాల్సింగ్, మాజి ఉప సర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్, రానాపూర్ మాజి ఉప సర్పంచ్ కొమురల్లి గౌడ్, విలేజ్ వైస్ ప్రెసిడెంట్ దండుగుల శ్రీకాంత్, బడుగు మహేందర్, కాదశి నర్సయ్య,బొల్లు శేఖర్,వస్రం నాయక్, బాలు నాయక్,రాజు, అజయ్, దండుగుల సది,కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేకు సదాశయ ఫౌండేషన్ వినతిపత్రం



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):**
నేత్రదాన కార్యక్రమాలను 108 కు అనుసంధానం చేసేందుకు కృషి చేయాలని కోరుతూ.. శుక్రవారం సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ వినతిపత్రం అందించారు. ఉదయం తన తోటి సభ్యులతో ఎమ్మెల్యే ను కలిసిన ఆయన ముందుగా ఫౌండేషన్ వార్షికోత్సవానికి ఆహ్వానించి, అనుసంధానాన్ని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరుతూ, లేఖ రాశారు. ఇక ఆయన వెంట ఫౌండేషన్ నాయకులు శ్రావణ్ కుమార్, భీష్మాచారి, నూక రమేష్, రామకృష్ణారెడ్డి, వాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం. రాజిరెడ్డి, జి. రాజేష్ ఉన్నారు.

## వడ్లు కొనుగోలు కేంద్రాలను
# ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

- కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** పాలకుర్తి మండలం జయ్యారం, పుట్నూర్ కేంద్రంలో సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్నీ ప్రారంభించిన శాసన సభ్యులు మక్కన్ సింగ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వమని ఆరుగాలం కష్టపడి తన రెక్కల కష్టంతో ఎందరో ఆకలి తీర్చే అన్నదాతకు అన్యాయం జరగవద్దని అన్నారు. రైతును కష్టపెట్టిన ఎ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడలేదని గత పాలకుల చేతిలో రైతన్నలు చాలా నష్టపోయారని తెలిపారు. గతంలో మాదిరిగా రైతన్నలను ఇబ్బందులకు గురిచేస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రైతులు పండించిన పంట విషయంలో ఎలాంటి కోతలు విదించకూడదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశించారు. ఒకవేళ ధాన్యం కోతలు చేస్తున్నారని మా దృష్టికి వస్తే 24 గంటలు గడవకముందే వారినీ బాధ్యతల నుండి తొలగించి నూతనంగా ఇతరులను చేర్చడం జరుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో ఎవరి మాటా వినబోమని స్పష్టం చేశారు. రైతులు తమకు ఎలాంటి ఇబ్బందులూ వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ఈ సీజన్ నుండే సన్న రకం పంటకు 500 బోనస్ అందించడం జరుగుతుందని అన్నారు. రైతు తన ధాన్యం అమ్మకం జరిపిన వెంటనే రెండు లేదా మూడు రోజుల్లోనే తమ పంట డబ్బులను రైతు ఖాతాలలోని జమ చేయడానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పాలకుర్తి మండల తాజా మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శిగా వీరేశం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)**
తెలంగాణా ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా గుర్రాల వీరేశం నియమితులయ్యారు. ఈ మేరకు చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ, ఆంధ్రా పాలకుల పాలనలో తెలంగాణా ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని, ఆ పాలకుల నిరంకుశత్వాన్ని ఎదురిస్తూ సాగిన పోరాటంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాసుకు ఆయన కృతజ్ఞతలొ తెలిపారు.

# పదవి విరమణ పొందిన హెూం గార్డు బోనగిరి సంజీవ్

## సత్కరించి వీడ్కోలు పలికిన అడిషనల్ డీసీపీ ఏ ఆర్ అనోక్ జయ్ కుమార్



**కరీంనగర్ క్రైమ్ అక్టోబర్ 25 ( క్రైమ్ న్యూస్):** కరీంనగర్ లోని హుజురాబాద్ సబ్ కోర్ట్ నందు హెూంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బోనగిరి సంజీవ్ 34 సం.లు పోలీస్ శాఖలో సేవలందించి శుక్రవారం నాడు పదవి విరమణ పొందారు. కరీంనగర్ అడిషనల్ డీసీపీ ఏ ఆర్ అనోక్ జయ్ కుమార్ చేతుల మీదుగా పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. పూలమాల వేసి, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ (హెూంగార్డ్స్) మోడెం సురేష్, హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువ సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి

- రెండు రోజుల్లో కొత్త కంపెనీలో చేరాల్సిన యువకుడు వంశీ
- ఫ్రెండ్‌తో బైక్ పై వెళ్తుండగా ప్రమాదం - అక్కడికక్కడే మృతి చెందిన వంశీ
- పుట్టెడు దుఃఖంలో కూడా కొడుకు నేత్రాలను దానం చేసిన తల్లిదండ్రులు
- అభినందించిన లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సిరిపురం వంశీ (27) అనే యువ సాఫ్ట్వేర్ ఇంజనీర్, గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగిలి మృతి చెందాడు. కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో కూడా తల్లిదండ్రులు ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి, కొడుకు నేత్రాలను దానం చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. వివరాల్లోకి వెలితే సింగరేణి సంస్థ ఓసీపీ-3లో జనరల్ మజ్దూర్, సీనియర్ కళాకారుడు సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు స్థానిక తిరుమల నగర్ లో ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమారుడు వంశీ, హైదరాబాద్ లో ఓ కంపెనీలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. ప్యాకేజీ ఎక్కువగా ఇచ్చే మరో కంపెనీలో వంశీకి ఉద్యోగం వచ్చింది. రెండు రోజుల్లో కొత్త కంపెనీ లో చేరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఫ్రెండ్స్ ను కలుసుకోవడానికి బయటకు వెళ్లిన వంశీ, గురువారం రాత్రి ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్ లో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా, మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. వంశీ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, సోదరుడు సూర్య గుండెలవిసేలా రోధించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు, రామగుండం లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కజాంపురం రాజేందర్, సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు ఆధ్వర్యంలో మృతుడు వంశీ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్



టెక్నీషియన్ సతీశ్ కుమార్ ద్వారా నేత్రాలను సేకరించి, హైదరాబాద్ కు తరలించారు. నేత్రాదాన కార్యక్రమంలో రామగుండం కళాకారుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు మేజిక్ రాజా, స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చంద్రపాల్ పాల్గొన్నారు. కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు, కొడుకు నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాధించడానికి ముందుకు రావడం పట్ల సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్ కుమార్, కార్యదర్శి సీహెచ్. లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణా రెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్, కార్యదర్శి ఎల్లప్ప, ఆర్ఎంపి రమేష్, మృతుని బంధువు శ్రీకాంత్, కళాకారులు బోడకుంట వెంకట్రాజం, గద్దల శశిభూషన్ తదితరులు అభినందించారు. కాగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ దాసు మారుతి, నూతి తిరుపతి, మెతుకు దేవరాజ్ తదితరులు ఆసుపత్రి వద్దకు వచ్చి సిరిపురం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మత్స్యకారులు ఆర్థికంగా
# అభివృద్ధి చెందాలనే చేప పిల్లల పంపిణీ
### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**మానకొండూర్(ది క్రైం న్యూస్):** కరీంనర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలోని చెరువులో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేప పిల్లలను వదిలారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ..... మత్స్య కారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, తొలి విడతలో కరీంనగర్ జిల్లాతోపాటు హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాల పల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల జిల్లాల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాగా, రెండో విడుతలో మిగితా జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం కొనసాగు తున్నదని, అందులో భాగంగానే అన్నారం చెరువులో చేప పిల్లలను వదలడం జరిగిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ విద్యాభారతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మానకొండూర్ మండల వ్యవసాయ మార్కెట్



కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, గంగుల మహేందర్, మీస సత్యనారాయణ, మాడ తిరుపతిరెడ్డి, సాయిరి దేవయ్య, ఆర్ శ్రీనివాస్, సహదేవ్, ప్రేమ్ కుమార్, కోంండ్ర సురేష్, రామాంజనేయులు, శ్రీధర్, సతీష్, కిషన్ పాల్గొన్నారు.

## కార్మికులకు , యాజమాన్యాలకు వారధిగా యూనియన్ లు వ్యవహరించాలి
### సింగరేణి సంస్థ సి అండ్ ఎండి బలరాం నాయక్




**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** కార్మికులకు యాజమాన్యాలకు వారధిగా సింగరేణిలో ఉన్న గుర్తింపు సంఘాలు ప్రాతినిధ్య సంఘాలు వ్యవహరించాలని సింగరేణి సీ అండ్ ఎండి బలరాం నాయక్ అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో యూనియన్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మూడో రోజు ముఖ్య అతిథిగా హాజరైన సి అండ్ ఎం డి బలరాం నాయక్ సింగరేణి లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు సింగరేణి యాజమాన్యం, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో హైదరాబాద్ లో అక్టోబర్ 23 నుంచి 26 వరకు జరుగు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మూడోవ రోజు ముగింపు కార్యక్రమానికి సింగరేణి సి అండ్ ఎం.డి బలరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . ఈ శిక్షణా కార్యక్రమాల్లో సంస్థ డైరెక్టర్ ఫా జి.వెంకటేశ్వర్ రెడ్డి , సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయుసి నాయకులు జనక్ ప్రసాద్ తో పాటు నాయకులు ఎల్.ప్రకాశ్, వై.వి.రావు, మడ్డి ఎల్లా గౌడ్, కందికట్ల వీరభద్రం, వంగ వెంకట్, ఆరెల్లి పోషం, జీగురు రవిందర్, ఎం.రాంచంద్రారెడ్డి, భాజీసైదా, కె.మల్లికార్జున్, రమణ మూర్తి తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఇండియా వారి మైనింగ్ డివిజన్ కు సంబంధించిన విధివిధానాలు, సింగరేణి లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యం తో అనుసరించవలసిన విధి విధానాలు తదితర అంశాల పై నాయకులకు శిక్షణ ఇచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా కు చెందిన లెక్చరర్ లు తదితరులు పాల్గొన్నారు.

### అల్ఫోర్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి
## ఆర్చరీ పోటీలకు ఎంపిక



**కరీంనగర్ ప్రతినిధి, అక్టోబర్ 25(క్రైమ్ న్యూస్):** క్రీడల ద్వారా విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని ప్రత్యేకంగా లక్ష్యాలను సాధించే విధానాలను తెలుసుకోవచ్చని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టేక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్చరీ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా చాలా ఆసక్తికరమైన క్రీడాగా పరిగణించడం జరుగుతున్నదని వారు చెప్పారు. ఈ క్రీడ పట్ల చాలా మంది ఆసక్తి కనపర్చడమే కాకుండా పట్టు సాధించడానికి నిష్ణాతులచే శిక్షణ పొందుతున్నారని చెప్పారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రోత్సహిమిస్తూ చేయూతనిస్తున్నామని తెలిపారు.ఈ క్రమంలో ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ అకాడమీలో నిర్వహించనటువంటి ఎస్.జి.ఎఫ్ జోనల్ స్థాయి ఆర్చరీ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి కె.వందన, 10 వ తరగతి, కె. మణికేశ్వర్, 9వ తరగతి, జి.హర్షిణి, 9వ తరగతి మరియు జి.హర్షిత, 9 వ తరగతి, అండర్-17 బాలబాలికల విభాగంలో అసమాన ప్రతిభతో ఎతకాలు సాధించడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం చాలా గొప్ప విషయమని చెప్పారు అర్హత సాధించిన పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభను చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాభినందనలు తెలియజేశారు.

## సింగరేణి సాంస్కృతిక పోటీలు ప్రారంభం



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** స్థానిక సీఈఆర్ క్లబ్ లో సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం రీజియన్ స్థాయి సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. ముందుగా రామగుండం ఒకటవ డివిజన్, రెండవ డివిజన్ ల మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఇక పోటీల నిర్వాహణలో అసోసియేషన్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, కో ఆర్డినేటర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

### అక్టోబర్ 30 లోగా భాజపా
## సభ్యత్వ నమోదు సంఖ్యను పెంచాలి
### బిజెపి నాయకులు సురేష్ రెడ్డి, క్యాతం వెంకటరమణ



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** అక్టోబర్ 30వ తేదీలోగా భాజపా సభ్యత్వ నమోదు సంఖ్యను పెంచాలని భాజపా నాయకులు అన్నారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు రివ్యూ సమావేశం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని బిజెపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రవాసి గొట్టిముక్కుల సురేష్ రెడ్డి , జిల్లా సభ్యత్వ ఇంచార్జి ఆర్ముళ్ళ పోచం, నియోజకవర్గ ఇన్చార్జి కందుల సంధ్యారాణి, జిల్లా సభ్యత్వ కన్వీనర్ క్యాతం వెంకటరమణ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గం లో పార్టీ సభ్యత్వాన్ని పెంపొందించాలని తెలియజేశారు ఇప్పటివరకు జిల్లాలో 38వేల సభ్యత్వం నమోదు కాగా రామగుండం అసెంబ్లీలో 13వేల సభ్యత్వం పూర్తయిందని కార్యకర్తల అందరి కృషి వల్ల ఇది సాధ్యమైంది అని అన్నారు. అక్టోబర్ 30వ తేదీ వరకు సమయం ఉందని 26,27,28, తేదీలలో ప్రత్యేక సభ్యత్ స్పెషల్ డ్రైవ్ కింద పోలింగ్ బూత్ ల వారిగా సీనియర్ నాయకులు సమయం ఇచ్చి పనిచేయాలని సూచించారు.. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కోడూరు రమేష్, గోపగాని నవీన్ గౌడ్, మహావాది రామన్న, లక్ష్మీ నరసయ్య, గుండబోయిన లక్ష్మణ్ యాదవ్, అందే రాజకుమార్, దండు పవన్, జనగామ సాగర్, జక్కుల పద్మ, అపర్ణ, గంధం అజయ్, తదితరులు పాల్గొన్నారు.

### 9వ సారి రక్తదానం చేసిన రెడ్ క్రాస్ సంస్థ సభ్యుడు బత్తిని అనిల్ కుమార్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)** ప్రముఖ సామాజిక సేవకులు,రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి శాఖ సభ్యులు బత్తిని అనిల్ కుమార్ తన పుట్టినరోజు పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణ కేంద్రంలో గల గవర్నమెంట్ బ్లడ్ బ్యాంక్ లో 9 వసారి స్వచ్ఛంద రక్తదానం చేశారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా చేర్మెన్ కావేటి రాజగోపాల్ పాల్గొని అనిల్ కుమార్ ను అభినందించి,యువత రక్తదానాలలో ముందుండి,సమాజానికి ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ అరవింద్ రెడ్డి,సురేష్,రాము,రాజు,నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# కార్యదర్శికి మెమో జారీ

**ముత్తారం.అక్టోబర్.25.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామ పంచాయతీ కార్యదర్శి జైపాల్ కు ఎంపిడిఓ సురేష్ శుక్రవారం మెమో జారీ చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ట్యాంకర్ ను గ్రామ ప్రత్యేక అధికారి అయిన ఎంపిడిఓ నుంచి అనుమతులు లేకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి జైపాల్ లీజ్ కు ఇచ్చాడని పేర్కొంటూ సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి జైపాల్ పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ను లీజ్ కు ఇచ్చిన సమయంలో అతను లీవ్లో ఉండి,ఇష్టానుసారంగా వ్యవహరించడంపై వివరణ ఇవ్వాలని తెలియజేస్తూ ఎంపిడిఓ గ్రామ పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేశారు.ఇక నుంచి మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,సంబంధిత పైఅధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అధికారులు వ్యవహరిస్తే శాఖపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు.

## ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేపించాలి: ఎంపిడిఓ సురేష్



**ముత్తారం.అక్టోబర్.25.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా పారిశుద్ధ్య,శానిటేషన్ పనులను ఎంపీడీవో సురేష్ పర్యవేక్షించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ చాలా రోజులుగా నిల్వ ఉన్న నీటిని,గుంతల్లో ఉన్న నీటిని తొలగింపజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలని, మంచి నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని,కాలవల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు.పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్,సిబ్బంది ఉన్నారు.

# తహసిల్దార్ ఎదుట బైండోవర్



**ముత్తారం అక్టోబర్.25.(దిక్రైమ్‌న్యూస్):**ముత్తారం మండలంలోనీ అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, ముత్తారం, ఇప్పలపల్లి, కేషన్ పల్లి, మచ్చుపేట, మైదంబండ గ్రామాల నుంచి నాటు సారా విక్రయిస్తున్న పది మందిని శుక్రవారం ముత్తారం తహసిల్దార్ సుమన్ ముందు ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ బైండోవర్ చేశారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ పలు గ్రామాలలో గుడుంబా విక్రయిస్తున్న వారిపై దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకొని శుక్రవారం తహసిల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు.మండలంలో గుడుంబా తయారుచేసిన,విక్రయించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ తెలిపారు.

# గ్యాస్ సిలిండర్ అందజేత..



**జమ్మికుంట అక్టోబర్ 25 (ది క్రైమ్ న్యూస్)** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి జిల్లా అధికారుల సూచన మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు సిలిండర్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు విద్యార్థులు మధ్యాహ్నం భోజనం వేళలో ఇబ్బందులకు గురవుతున్నారని గ్రహించి వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్టా సునీల్ యాదవ్



**కూకట్ పల్లి అక్టోబర్ 25 (ది క్రైమ్ న్యూస్):** అమ్రిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ కళశాల విద్యార్థులు ఓకేషనల్ కోర్సు లో భాగంగా పారామెడికల్ విభాగంలో చేరారు. ఒకోక్కో విద్యార్థి నుంచి 50వేల నుండి లక్ష రూపాయల వరకు యాజమాన్యం విద్యార్థుల వద్ద నుండి తీసుకుందని కాని విద్యార్థులు తీసుకున్న కోర్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో వర్తించదని తెలుసుకున్న విద్యార్థులు ఆందోళన చెంది కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో యాజమాన్యం పై ఫిర్యాదు చేసారు. ఈ సందర్బంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్టా సునీల్ యాదవ్ విద్యార్డులకు మద్దతుగా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో యాజమాన్యం పై కేసు నమోదు చేయించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని యాజమాన్యం వారిని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్ ఇపిస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని జిట్టా సునీల్ కుమార్ యాదవ్ తెలిపారు.

### గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా

# ఉండేందుకే కాటమయ్య కిట్ల పంపిణీ

## రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్



గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గీతా కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వము కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ అన్నారు. గోదావరిఖని లోని గాంధీనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్లు గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురి కాకుండా ప్రభుత్వం కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్నదన్నారు. అందులో భాగంగా రామగుండం నియోజకవర్గంలో పాలకుర్తి మరియు అంతర్గం మండలంలోని 90 మంది గౌడన్నలకు రూ.12 వేల రూపాయలవిలువైన కిట్లను అందించటం జరిగిందన్నారు. వాటి వాడకంపై ట్రైనింగ్ కూడా ఇస్తామన్నారు.తెలంగాణ లో గత పదేండ్ల నుంచి గీత కార్మికుల ప్రమాదాలు, మరణాలు గణనీయంగా పెరిగాయని అన్నారు.. కల్లు తీసే సమయంలో మోకుల ముడి ఊడిపోవటం, చెట్లు ఎక్కేటప్పుడు జారటంతో కార్మికులు తాటిచెట్ల మీద నుంచి పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు.. గత పదేళ్లలో రాష్ట్రంలో 775 మంది గీత కార్మికులు ప్రాణాలు కోల్పోయారని,దాదాపు 2 వేల మంది శాశ్వతంగా వైకల్యం పొందారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇన్ని ప్రమాదాలు జరిగిన గీత కార్మికుల కోసం గత బి. ఆర్.ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డ చందంగా వ్యవరించిందని, గౌడన్న లకు చేసింది ఏమి లేదు అనే విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి, అంతర్గాం గీత కార్మికులు అదేవిధంగా రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నెలవారీ కమీషనరేట్ స్థాయి నేర సమీక్ష సమావేశం ఏర్పాటు

## పలు కీలక సూచనలు చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్



**కరీంనగర్ టౌన్, అక్టోబర్25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలు నందు కమీషనరేటులోని అన్ని విభాగాల అధికారులు, ఇన్స్పెక్టర్లు పోలీస్ స్టేషన్ ల ఎస్.హెచ్.ఓ. లతో కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అధికారులందరికీ పలు కీలక సూచనలు చేసారు. చాలా కాలంగా పెండింగ్ లో వున్న కేసుల పై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలపై ఆరాదీశారు. అధికారులంతా ముఖ్యంగా అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి, క్షేత్రస్థాయిలో ఫలితాలనిచ్చే విధంగా చర్యలు ఉండాలని సూచించారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు ఉన్నట్లయితే వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు.తరుచూ నేరాలు జరిగే ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టి వాటిని అరికట్టేలా కృషి చేయాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతీ ఫిర్యాదును వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఏదైనా సమస్య తలెత్తినదని తెలిసిన వెంటనే స్పదించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సమాజంలో పదే పదే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారితో పాటు , ప్రజలను మోసం చేసే వారి పై ఖచ్చితంగా షీట్లను తెరవాలన్నారు. ఇటీవల అక్రమ గంజాయి రవాణా మరియు వాడకం పెరిగిపోతున్నందున దానిని అరికట్టేందుకు ఇప్పటికే ప్రత్యేకంగా కమిషనరేట్ స్థాయిలో నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామని, దాని సహాయంతో క్షేత్రస్థాయిలో ఎన్.డి.పి.ఎస్. ఆక్ట్ ద్వారా కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి పట్టుపడిన సమయంలో వారిపై నమోదు చేసిన కేసు వీగిపోకుండా, నిందితుడికి శిక్ష పడేవిధంగా టి జి నాబ్ వారు ప్రవేశపెట్టిన నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నందున వాటి నియంత్రణ మరియు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ స్టేషన్ల వారీగా సైబర్ వారియర్ లను నియమించామని, సంబంధిత పోలీస్ స్టేషన్లో సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే వారు స్పందించి , బాధితులకు సహకరించి 1930 కి , ఎన్.సి.ఆర్.బి పోర్టల్ కి సమాచారం అందించి అకనాలెడ్జ్ ని పొందాలని, దాని ఆధారంగా పోగొట్టుకున్న సొత్తును తిరిగి తెప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.కమీషనరేట్ స్థాయిలో సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యాలయం ఎప్పటికప్పుడు కమీషనరేట్ స్థాయిలో జరిగే నేరాలు అడ్డుకట్టవేసేందుకు పనిచేస్తుందన్నారు. ఇప్పటి వరకు ఛేదించిన సైబర్ క్రైమ్ కేసులు బాధితుల సొత్తును తిరిగి ఇప్పించుటలో రాష్ట్రంలో కరీంనగర్ కమీషనరేట్ రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచినందున రాష్ట్రస్థాయి అధికారులు అభినందించారని తెలిపారు. డివిజన్ ల వారిగా రోడ్డు ప్రమాదాల పై సమీక్ష చేసారు. ఒకే చోట పలుసార్లు ప్రమాదాలు జరిగే చోటును హాట్ స్పాట్ గా గుర్తించి, వాటికీ గల కారణాలను తెలుసుకుని అవసరమైతే ఇతర శాఖల సమన్వయం తో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కమీషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల వారీగా చాలా కాలంగా పెండింగ్ లో వున్న కేసుల వివరాలు , అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే పెండింగ్ వారెంట్లను ముఖ్యంగా భౌతిక నేరాలకు సంబందించిన వాటిని అమలయ్యేలా చూడాలన్నారు. అక్రమ ఇసుక రవాణా , పి డి ఎస్ బియ్యం , పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం మొదలగు వాటిపై ఉక్కు పాదం మోపాలన్నారు. పట్టుబడిన వారిపై సంబంధిత కేసులు నమోదు చేయటమే గాక, వీలైనంత తొందరగా ఛార్జ్ షీట్లు సైతం దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ లు శ్రీనివాస్ (సి.ఎస్.బి), నరేందర్, వెంకటరమణ, విజయ్ కుమార్, వేణుగోపాల్ , కాశయ్య, మాధవి , సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ నర్సింహా రెడ్డి లతో పాటుగా సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

## సిద్దయ్య కుటుంబానికి అండగా నిలిచిన పద్మశాలి కులస్తులు



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లాకమలాపూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన చేరాల సిద్దయ్య కుటుంబానికి పద్మశాలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తులు ఆర్థిక సాయం అందజేశారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం చేరాల సిద్దయ్యది. చేనేత వృత్తితో మూడేళ్లుగా బ్యాంకులో దాచుకున్న 40 వేల రూపాయలను ఇటీవల డ్రా చేసుకొని ఇంటికి వెళుతున్న క్రమములో దొంగలు డబ్బులు కాజేశారు.

కష్టపడి దాచుకున్న డబ్బులు దొంగల పాలవడంతో మనస్థాపానికి లోనైన సిద్దయ్య బాధపడుతుండగా తెలుసుకున్న కమలాపూర్ పద్మశాలి పట్టణ కమిటీ ఆర్థిక సాయానికి ముందుకు వచ్చి పద్మశాలి కులస్తుల సహకారంతో శుక్రవారం రోజున 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్, పట్టణ పద్మశాలి ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, మెండు రమేష్, పులికంటి ప్రభాకర్, వెల్ది రాము,ఆడెపు శ్రీకాంత్, పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమ కమిటీ ఫోరం

## కమలాపూర్ మండల అధ్యక్షునిగా మౌటం సంపత్



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఉద్యమ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ మరియు జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి కలిసి కమలాపూర్ మండలానికి చెందిన తెలంగాణ రాకముందు నుండి అనేక ఉద్యమాలు చేసి జేఏసీ నాయకునిగా ఉండి తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకైన పాత్ర పోషించిన మౌటం సంపత్ గారికి కమలాపూర్ మండల తెలంగాణ ఉద్యమ కమిటీ ఫోరం అధ్యక్షుడిగా నియమిస్తూ ఒక ప్రకటనలో తెలిపారు. నన్ను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి మరియు మండలానికి చెందిన రాష్ట్ర కో కన్వీనర్ మోకిడ ప్రసాద్ గారికి నా సహచర ఉద్యమకారులకు చేదోడు వాదోడుగా ఉంటానని ఈ గవర్నమెంట్ ఆరు గ్యారెంటీలో ఒక గ్యారెంటీ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీని నెరవేర్చే దాకా ఉద్యమిస్తానని తెలియజేస్తూ ఉద్యమకారులను కలుపుకొని పోతానని తెలియజేస్తూ జై తెలంగాణ జై జై తెలంగాణ

## జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల దరఖాస్తు స్వీకరణ పత్రాల విడుదల

రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు.(టి యు డబ్ల్యూ జె)



**ది క్రైమ్ న్యూస్ అక్టోబర్ 25 భూపాలపల్లి:** మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఖ్యాతం సతీష్ కుమార్, కార్యదర్శి సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల దరఖాస్తు స్వీకరణ పత్రాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు గడిపెల్లి మధు విడుదల చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు అనుబంధ సంస్థ) ఈ సందర్భంగా గాడిపల్లి మధు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కల నెరవేరబోతుందని, గత ఏ ప్రభుత్వాలు కూడా జర్నలిస్టుల యొక్క సంక్షేమం దిశగా అడుగులు వేయలేదని, మొట్టమొదటిసారిగా మీడియా అకాడమీ చైర్మన్ అయినటువంటి శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో టి యూడబ్ల్యూ జె (ఐ జేయు) రాష్ట్ర కమిటీ జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం దరఖాస్తు స్వీకరణ పత్రాన్ని విడుదల చేయడం చాలా సంతోషమని తెలిపారు .జిల్లాలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా ఇంటి స్థలాల కోసం అప్లికేషన్ నింపి జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు క్యాతం సతీష్ కుమార్, సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీకి పంపిచాల్సిందిగా తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి జర్నలిస్ట్ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యామల శ్రీనివాస్, తెంజు అధ్యక్షులు సాంబయ్య, చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ తోపాటు సీనియర్ రిపోర్టర్ సర్వేశ్వరరావు ,సనిగల లక్ష్మన్,మెండ మల్లేష్, బత్తుల మల్లయ్య, గోగు రామస్వామి, గజ్జల రాజయ్య, లక్ష్మణ్ ,దూలంరవి,సుధాకర్ తో పాటు జిల్లాలోని అన్ని మండలాల జర్నలిస్టులు,ఐజేయు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

### రామగుండం-త్రీ ఏరియా సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని రామగుండం-త్రీ ఏరియా సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సెంటినరీ కాలనీలోని సేవా భవన్ నందు టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటీషియన్ మొదలగు విభాగాలలో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం సింగరేణి సేవా సమితి ఎన్నో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. కావున ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని, నైపుణ్యాన్ని సంపాదించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని అన్నారు. గతంలో శిక్షణ పొందిన చాలా మంది మహిళలు, ప్రస్తుతం స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డి.పి.ఎం. గుర్రం శ్రీహరి, సినియర్ పర్సనల్ ఆఫీసర్ పి.రాజేశం, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయ కర్త బి.రాయమల్లు, సేవా సభ్యులు, శిక్షకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఆలయాలపై దాడికి నిరసనగా భారీ ర్యాలీ..

### తాహసిల్దార్‌కు పోలీసులకు ఫిర్యాదు..



**జగిత్యాల (ది క్రైమ్ న్యూస్ రాయికల్):** హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి లో అగంతకులు చొరబడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి చూసిన హిందువులు అమ్మవారి భక్తులు తీవ్రమైన ఆవేదన మరియు ఆగ్రహానికి గురయ్యారు, రాయికల్ పట్టణంలోని స్థానిక గాంధీ బొమ్మ నుండి అంగడి బజార్ మీదుగా ర్యాలీగా వెళ్లి తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాహసిల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఖాయ్యుంకు వినతి పత్రం సమర్పించారు అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా బయలుదేరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు ఇట్టి సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవ్వరు వ్యవహరించిన ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని,చట్టపరంగా ముందుకొచ్చి కొట్లాది హిందువులకు ప్రతిక అయిన ఆలయాలను రక్షించే దిశగా వ్యవహరించాలని హైదరాబాద్ పరిధిలోని ముత్యాలమ్మ దేవాలయలంలో అమ్మవారి విగ్రహం పై దాడి చేసిన దుండగుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నప్పటికిని ఈ అల్లరి ముకలపై ప్రభుత్వాలు ఒక్క పాదం మోపాలని సూచించారు ఇలాంటివి జరగకుండా ఉండాలని వారు కోరారు..

# ఇదారే అదబ్ ఇస్లామీ హింద్ పెద్దపల్లి నూతన కమిటీ

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** ఇదారే అదబ్ ఇస్లామీ హింద్ పెద్దపెల్లి జిల్లానూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణా అధ్యక్షుడు జనాబ్ షోయబ్ అల్ హక్ తాలిబ్ సాహెబ్ తెలిపారు. పెద్దపల్లిలోని ఫరాన్ కాంప్లెక్స్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొని, కొత్తగా ఏర్పడిన కమిటీని నియమించడం జరిగిందని తెలిపారు. అధ్యక్షుడుగా సయ్యద్ మతీన్ ఉద్దీన్,ఉపాధ్యక్షులుగా ముఫ్తీ ఇమ్తియాజ్ ఖాన్ అసాది, సయ్యద్ వజాహత్ ఉల్లా అయాజ్ అఫాఖీ,మహమ్మద్ జావెద్ అలీ ఆజ్మీ,జనరల్ సెక్రటరీగా సయ్యద్ ఇమ్రాన్ సూఫీ,సెక్రటరీగా మౌలానా సయ్యద్ తౌసీఫ్అసాది,ఖజాంచిగా మహమ్మద్ జమీర్ ఉద్దీన్,కమిటీ సభ్యులుగా ఖలీల్ అహ్మద్, ముఫ్తీ లైఖ్ ఉల్లా ఖాస్మీ,మహమ్మద్ అరిఫ్ ఉద్దీన్, మహమ్మద్ అబ్దుల్ మొయిద్,మహమ్మద్ అబ్దుల్ రౌఫ్ అజీజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పెద్దపల్లి ప్రాంతంలో సాహిత్య మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడంలో ఇదారే అదబ్ ఇస్లామీ హింద్ యొక్క ముఖ్యమైన ఉద్దేశమని తెలిపారు. కాగా



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇ ఇస్లామి హింద్ పెద్ద పెల్లి అధ్యక్షులు అబ్దుల్ హై జావిద్, సయ్యద్ బదియోద్దీన్, ఎం ఏ రహీం, అజీజ్, ముక్తి సాధఖుల్లా మరియు మత పెద్దలు పాల్గొన్నారు.

# సాదన చేస్తూ ప్రయత్నిస్తే గెలుపును సొంతం చేసుకోవచ్చు

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**తిమ్మాపూర్ (ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 2024-25 జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటల పోటీల్లో విజేతులుగా నిలిచిన వాళ్ళు సంతోషంగా ఉండటం సహజమే కాని ఓడిన వాళ్ళు ఓటమికి కుంగిపోకూడదని, సాధన చేస్తూ ప్రయత్నిస్తే గెలుపును సొంతం చేసుకోవచ్చని ఇక ముందు ఆడబోయే క్రీడల్లో విజయాలు సాధించేందుకు గురుకుల విద్యార్థులకు ఈ క్రీడోత్సవాలు పునాది కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆటంటేనే గెలుపు ఓటములని,పోటీల్లోనే సత్తా చాటుకునే అవకాశం ఉంటుందని, క్రీడల్లో రాణించేందుకు ఈ తరహా క్రీడా పోటీలు దోహదపడతాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు. అభిరుచి గల క్రీడల్లో రాణింపునకు నిరంతర సాధన అవసరమని జట్టుగా ఆడే ఆటల్లో సామూహిక ప్రతిభను ప్రదర్శించాల్సి ఉంటుందని, ఆ దిశగా జట్టు సభ్యులంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు దోహదపడే క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తికనబర్చాలని, దేశానికి క్రీడల్లో పతకాలు తెచ్చిపెట్టిన పీ.టీ ఉష లాంటి



గొప్పవాళ్ళు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే క్రీడాకారులను కోరారు. పతకాల పట్టికలో మన ఘనతను చాటుకోవాల్సిన అవసరం ఉందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్నదని, అందులో భాగంగానే స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభిస్తున్నదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రీడల్లో విజతలు నిలిచిన ఆటగాళ్లను, క్రీడోత్సవాల నిర్వాహకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు.

## సెంటెనరీ కాలనీ సింగరేణి క్వార్టర్స్ లోని సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లిన తాజమాజీ సర్పంచ్ అల్లం పద్మ-తిరుపతి




**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లోని సెంటినరీ కాలనీ సింగరేణి క్వార్టర్స్ లో కార్మిక కుటుంబాలు ఎదుర్కుంటున్న సమస్యలను స్థానిక పన్నూర్ తాజా మాజీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి లేఖ రూపకంగా ఆర్.జి-త్రీ జీఎం సుధాకర్ రావు కి అందించి సమస్యలను వివరించారు. అట్టి లేఖలో సెంటినరీ కాలనిలో రెండురోజులకు ఒక సారి పంపులు వస్తున్నాయని అందువలన నిత్యావసర పరిస్థితులలో నీళ్లు సరిపోక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుకుంటున్నారని, రాబోయే రోజుల్లో రోజుకు ఒకసారి పంపు నీళ్లు అందించాలని కోరారు. మరియు కార్మిక వాడల్లో శానిటేషన్ సరిగ్గా చేయడం లేదని ఏక్కడ చూసిన ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందని , మోరీలు సరిగ్గా క్లీన్ చేయడం లేదని సంబంధిత అధికారులతో చర్యలు జరిపి ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని , కొన్ని జాగల్లో మొరిలు పూర్తిగా చెడిపోయాయని క్వార్టర్ లకు చాల సంవత్సరాల క్రితం పెయింటింగ్ వేయించారని రాబోయే రోజుల్లో క్వాటర్లకు పెయింటింగ్ వేయించాలని, చిరిలో ప్రజల సమస్యలు దృష్టిలో పెట్టుకొని తెలిపిన సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని పన్నూర్ తాజా మాజీ సర్పంచ్ అల్లం పద్మ-తిరుపతి కోరారు.

## బీడీ కార్మికుల మహాసభను జయప్రదం చేయండి

### జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల భూమేశ్వర్,

**పెగడపల్లి, అక్టోబర్ 25 (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో 2.వ జిల్లా మహాసభలకు ఏ ఐ టి యు సి జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల భూమేశ్వర్ పిలుపునిచ్చారు. ఈనెల 26 న జగిత్యాల జిల్లా మల్యాల లో జరగబోయే జగిత్యాల జిల్లా బీడీ కార్మికుల (ఏ ఐ టి యు సి ) అనుబంధ సంఘం మహాసభను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు ఇరుగురాల భూమేశ్వర్.పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా లక్ష పైచిలుకు కార్మికులు ఉంటారని పేర్కొన్నారు బీడీ పరిశ్రమ సంక్షోభంలో అనేక హక్కులు సంక్షేమ పథకాలు కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఈ బీడీ కట్టల పైన నిండు డేంజర్ గుర్తులు వేయడం బీడీ ఆకు కొనడం, బీడీ కట్టల అమ్మకంపై జిఎస్టి ని పెంచి అనేక రకాల నిషేధాలు పెట్టడం మూలంగా కొంతమేరకు ఉపాధిని కార్మికులు కోల్పోయి పని లేని పరిస్థితి ఏర్పడింది. ఇఎస్ఐ హాస్పిటల్ ను జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలి. బీడీ పరిశ్రమపై పలుమార్లు పెంచుతున్న జిఎస్టి పన్నును తగ్గించాలి. విద్యార్థులకు సంక్షేమ పథకాలు అయినా బీడీ స్కాలర్ షిప్, ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం ఇతర పథకాలు యధావిధిగా కొనసాగించాలి. ఈపీఎఫ్ఓ సంస్థలో పి ఎఫ్ రాజీనామా అనంతరం బీడీ కార్మికులకు కనీస పెన్షన్ 6000 రూపాయలు ఇవ్వాలి.

చాలీచాలని వేతనాలతో తమ జీవితాలను నెట్టుకొస్తున్న బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ మహాసభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో బీడీ కార్మికులు పెద్ద ఎత్తున వారు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభ దృష్టికి తీసుకురావడంతోపాటు చర్చలో పాల్గొని కార్మిక వర్గ ప్రజా సంఘ నిర్మాణానికి పునాదులు వేయాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, జిల్లా నాయకులు శనిగారపు ప్రవీణ్, శ్రీ గాద దేవదాసు, వెన్న మహేష్, మండల ఏ ఐ టి యు సి కన్వీనర్ రాచర్ల సురేష్, మండల మహిళ బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు...

## హక్కుల కోసం ఒక్కటై పోరాటం చేయాలే...

- కొమురం భీం విగ్రహంఎక్కడ పెట్టినా ముందుంటాం
- నైజాం సర్కారుకు ఎదురొడ్డి పోరాడిన వీరుడు కొమురంభీం
- మహనీయుల చరిత్రను చాటి చెప్పాల్సిన బాధ్యత మనదే
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** ఆదివాసీ హక్కుల సాధన కోసం ఒక్కటైపోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మిఅన్నారు. మల్హార్ మండలం కొయ్యూర్ ప్రధాన కూడలిలోభూపాలపల్లి జిల్లా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో విగ్రహా దాత పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహా ఆవిష్కరణకు హజరైన ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసంలో కొమురంభీం వర్థంతిని మొదటగా జోడేఘాట్‌లో జరుపుకుంటామని అన్నారు. ఆదివాసీల్లో తొమ్మిది తెగలుఉంటాయని, అన్ని తెగలు ఒక్కతాటిపైకి వస్తేనే ఆదివాసీ సమాజం బాగుంటుందని ఆమె అన్నారు. అడవిలో ఉంటూ అడవినే నమ్ముకుని అడవినిపూజించే ఆదివాసీల అభివృద్ధికి తోడ్పాటునందించేవాళ్లను ఏనాడు మర్చిపోమని అన్నారు. ఆనాడు జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో కొమురం భీం నైజాం సర్కారుకు ఎదురొడ్డి పోరాటం చేశారని, ఎంతోమంది సైనికులను హతమార్చి ఆయనకూడా మరణించారని అన్నారు. అయితే నైజాం సర్కారు కొమురం భీం ఎందుకోసం సైనికులను చంపి అతను కూడా చనిపోయాడో తెలుసుకోవాలని ఒకరిని ఆదివాసీ గూడెంకు పంపించారని ఆమె గుర్తు చేశారు. వచ్చిన అతను ఇక్కడే ఉండి వివరాలు సేకరించి నైజాం సర్కార్‌కు నివేదించారన్నారు. అయితే ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు, కట్టుబాట్లు నచ్చిన అతను తన బార్య ఎలిజబెత్‌తో కలిసి ఇక్కడే ఉన్నాడని, లండన్‌లో ఉండాల్సిన అతను ఇక్కడే ఉండటం తమకు ఎంతో అనంతం ఇచ్చిందన్నారు. అలాంటి ఆ దంపతులను తాము ఏనాడుమర్చిపోమని, వారికి ప్రతి ఏటా నివాళులు అర్పిస్తుంటామన్నారు. ఆదివాసీల కోసం ఎవరు సాయం చేసినా వారిని గుర్తించుకుంటామన్నారు. తమకు రాజకీయాలు అవసరం లేదని, తమ జాతి అభ్యున్నతే తమ లక్ష్యమన్నారు. ఆనాడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, రిజర్వేషన్‌లతోనే ఈనాడు తాము ఈ స్థితికి చేరుకున్నామని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా చట్టపరంగా తమజాతిని గౌరవించాలన్నారు. కొమురం భీం విగ్రహం ఏర్పాటు చేసుకుంటామంటే పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. ఎక్కడ విగ్రహా ఆవిష్కర ఉంటేఅక్కడ తాము ముందుంటామని అన్నారు. మంథని నియోజకవర్గానికి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌బాబుకు ఆదివాసీలు గుర్తుకు రాలేదా అని ఆమె ప్రశ్నించారు. ఎక్కడా కొమురం భీం విగ్రహం పెట్టాలనే ఆలోచన ఎందుకు చేయలేదన్నారు. మహనీయుల చరిత్రను తెలుసుకుని చాటి చెప్పాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, మహనీయులను గౌరవించిన వాళ్లకే తమ సమాజం మద్దతునిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు...

**జమ్మికుంట అక్టోబర్ 25 (ది క్రైమ్ న్యూస్)** జమ్మికుంట పోలీసులు పెట్రోలింగ్ లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట కు వచ్చేసరికి చేరుకోగా ట్రాక్టర్ నెంబర్ టిఎస్ 02 బిఈ 9982 అను ట్రాక్టర్ విలాసాగర్ నుండి జమ్మికుంట వైపునకు వస్తుండగా పోలీసు వారు చెక్ చేయగా సరైన అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న విలాసాగర్ గ్రామానికి చెందిన గరిగంటి రాజేందర్ అను అతనిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్ ను పోలీసులు తరలించి కేసు నమోదు సిఐ తెలిపారు.



# ఆహ్లాదం.. ఆధ్యాత్మికం.. ఉడుపి



**బనశంకరి:** కన్నడనాట అందమైన తీరప్రాంతం ఉడుపి. ఇక్కడ పురాతన దేవాలయాలనుంచి అందమైన బీచ్‌లు, దట్టమైన అడవులు, ప్రకృతి సోయగాల వరకు అన్నీ చూడదగ్గ ప్రదేశాలే. ముఖ్యంగా శీతాకాలంలో ఈ ప్రాంతం ప్రధాన టూరిస్ట్ స్పాట్‌గా మారుతుంది. వర్షాకాలంలో కూడా చూడడానికి పెద్ద ఇబ్బంది ఉండదు. ఉడుపి నగరం మంగళూరుకు 55 కిలోమీటర్ల దూరంలో, బెంగళూరుకు పశ్చిమ దిక్కున 422 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. ఇది ఉడుపి జిల్లా కేంద్రమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం.అలాగే ప్రధాన పర్యాటక స్థలం ఈ నేపథ్యంలో ఉడుపి జిల్లా కర్ణాటకలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. సముద్ర రుచులు, సంప్రదాయ శాకాహార వంటకాలకు ఈ జిల్లా ప్రసిద్ధి.

**సముద్రంలో సెయింట్ మేరీస్ ఐలాండ్స్...** ఉడుపిలో మల్పె బీచ్ నుంచి కొన్ని కిలోమీటర్లు అరేబియా సముద్రంలో వెళితే సెయింట్ మెరీస్ దీవులను చేరవచ్చు. ఇది కూడా ప్రత్యేకమైన పర్యాటక స్థలం. మొత్తం నాలుగు ద్వీపాల సమూహాన్ని కోకోనట్ ఐలాండ్స్ అని కూడా అంటారు. ఇక్కడ ఉండే బసాల్ట్ రాళ్లు ఎవరో పేర్చినట్లుగా చక్కగా అమరి ఉంటాయి. ఇటువంటి రాళ్లు భారతదేశంలో మరెక్కడా లేవు. పెద్ద పెద్ద అలలతో కూడిన సముద్రంలో చిన్న చిన్న పడవల్లో ఈ దీవికి చేరుకోవాలంటే కొంచెం ధైర్యం ఉండాలి. ఇక మల్పే బీచ్ కూడా టూరిస్ట్‌స్పాట్.

**కోడి బీచ్.. సాగర సంగమం...** ఉడుపి నుంచి 36 కిలోమీటర్లు దూరంలో ఉండే కోడి బీచ్ కూడా ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశం. ప్రశాంతమైన వాతావరణంలో ఉండే బీచ్‌కు తక్కువ మంది పర్యాటకులు వస్తుంటారు. దీంతో ఇక్కడ ప్రశాంతంగా ఆస్వాదించవచ్చు. ఈ బీచ్‌కు మూడుదిక్కులా సముద్రమే ఉండటంతో చాలా అద్భుతంగా ఉంటుంది. అలాగే ఇక్కడ సువర్ణా నది అరేబియా సముద్రంలో కలిసే సాగర సంగమం పాయింట్ కూడా ఉంది.



**సెయింట్ లారెన్స్ చర్చ్...** ఉడుపి బస్టాండ్ నుంచి 18 కిలోమీటర్లు దూరంలోని అత్తూర్ చర్చ్ లేదా సెయింట్‌లారెన్స్ చర్చ్ కూడా సందర్శించాల్సిన ప్రాంతమే. ఇది రోమన్ క్యాథలిక్ చర్చ్ కావడం విశేషం.ఇక్కడ ఒక పాఠశాలతో పాటు అనాథాశ్రమం కూడా నిర్వహిస్తున్నారు. టిప్పు సుల్తాన్ కాలంలో ఇక్కడ ఒక కట్టడంలో క్రైస్తవులను బంధించారు. క్రైస్తవులు విడుదలైన తరువాత ఆ కట్టడాన్ని చర్చిగా నిర్మించుకొన్నారు. ఈ చర్చ్ మహిమ గల ప్రార్థనా మందిరంగా గుర్తింపు పొందింది.





**సుందర సముద్ర తీరాల విడిది శ్రీకృష్ణ ఆలయం...** 13 వ శాతాబ్దంలో నిర్మించిన శ్రీకృష్ణమఠం అని పిలిచే శ్రీకృష్ణుని ఆలయం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. ఈ ఆలయాన్ని జగద్గురు శ్రీమద్వాచార్యులు స్థాపించారు. ఈ ఆలయానికి ఉన్న ప్రత్యేకమైన విశేషం ఏమిటంటే నవగ్రహ కిండి అని పిలిచే 9 రంధ్రాలతో కూడిన కిటికీ నుంచి నల్లనయ్యను దర్శించుకోవాలి. ఈ ఆలయాన్ని తెల్లవారుజాము నుంచి రాత్రి 9 గంటల వరకు దర్శించుకోవచ్చు. భక్త కనకదాసుకు శ్రీకృ ష్ణుడు ఈ ఆలయంలో ప్రత్యేకంగా దర్శనమిచ్చాడని ప్రతీతి.

**మూకాంబికా అభయారణ్యం...** జిల్లాలోని కొల్లూరు సమీపంలో ఉండే మూకాంబికా అభయారణ్యం కూడా సందర్శించదగ్గ ప్రదేశం. పశ్చిమ కనుమలు ఉండే ఈ వన్యజీవి సంరక్షణ కేంద్రం జంతుప్రే మికులకు అమితంగా నచ్చుతుంది. మొత్తం పచ్చదనంతో నిండిన దట్టమైన అటవీప్రాంతంలో విహరించడం మంచి అనుభూతినిస్తుంది. అలాగే చుట్టుపక్కల మూకాంబికా దేవాలయం, అబ్బే వాటర్ ఫాల్స్, అరసినగుండి జలపాతం అలరిస్తాయి. తీరంలో మడ అడవుల్లో పడవల్లో విహారం కూడా చేయవచ్చు.



## శ్రమకు తగిన నిద్ర

మెదడు పనితీరుపై వయసు ప్రభావం అపారం. వయసు పెరుగుతున్న కొద్దీ మతిమరపుతోపాటు కొత్త విషయాలను నేర్చుకునే సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే వేగం తగ్గిపోతాయి. పెరిగే వయసుతోనే కాదు, తగ్గే నిద్రతోనూ సమస్య తీవ్రం అవుతుందని పరిశోధకులు గుర్తించారు. వయసుతోపాటు వచ్చే సమస్యలను వ్యాయామం ద్వారా వాయిదా వేయవచ్చని ఇప్పటి వరకూ భావించారు. ఇందులో కొంత నిజం ఉంది. కానీ, వ్యాయామానికి తగ్గట్టు నిద్రపోతేనే ఆశించిన ఫలితాలను అందుకోగలరు. లేకపోతే శ్రమంతా వృథాయే అని నిర్ధారిస్తూ లాన్సట్ జర్నల్ ఒక పరిశోధనా ఫలితాన్ని ప్రచురించింది. యాభై ఏండ్లు పైబడిన 8,958 మందిపై పదేండ్లపాటు నిర్వహించిన పరిశోధనలో.. మెదడు పనితీరుకు సంబంధించిన అనేక మార్పులను గుర్తించారు పరిశోధకులు. శారీరక శ్రమ (వ్యాయామాలు) చేసేవాళ్లు తగినంత నిద్రపోయినప్పుడు వాళ్ల మెదడు పనితీరు (జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే వేగం) చురుకుగా ఉన్నట్టు గుర్తించారు. ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయేవారిలో మాత్రం మతిమరుపు పెరిగింది, నేర్చుకునే సామర్థ్యాన్నీ కోల్పోయారు. ఎన్ని కసరత్తులు చేసినా శరీరానికి నిద్ర కూడా ముఖ్యమేనని ఈ పరిశోధన రుజువు చేస్తున్నది.

## కలవరపెడుతున్న
# కండ్లకలక

### లక్షణాలు, నివారణ మార్గాలు ఇవే..!

దేశ రాజధాని ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కండ్లకలక కేసులు వేగంగా పెరుగుతున్నాయి. మరింత విస్తరించకుండా ప్రజలంతా ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కండ్లకలకను పింక్ అని కూడా పిలుస్తుంటారు. కండ్లకలక ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉంటుందని, రద్దీగా అధికంగా ఉండే ప్రదేశాలతో పాటు బస్సులు, మెట్రోల్లో ప్రయాణించే సమయంలో ఐ ఫ్లూ సోకే ప్రమాదం ఉంటుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. వాహనాల్లో వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



**ఎలాంటి లక్షణాలు ఉంటాయంటే...** బ్యాక్టీరియా ద్వారా సోకుతుందని, దాంతో కళ్లు ఎర్రబారడం, దురదగా ఉండడం, కళ్ల రెప్పల్లో వాపు, నీరుకారడంతో, ఫ్లూయిడ్ డిశ్చార్జ్ కావడం తదితర లక్షణాలు కనిపిస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఒకసారి సోకితే తగ్గడానికి ఒకటి నుంచి రెండువారాల సమయం పడుతుంది. వయసుతూ సంబంధం లేకుండా ఏ వయస్సులోని వారికైనా ఈ ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంటుందని, ఈ క్రమంలో అందరూ నివారణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇది చిన్నపాటి ఇన్ఫెక్షన్‌గా అనిపించినా.. రోజువారీ జీవితాన్ని, పనులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఏ పని సైతం చేసుకోనివ్వకుండా చేస్తుంది. ఇది సాధారణంగా గాలి ద్వారా కోతుందని, వర్షాకాలంలో వాతావరణంలో మురికి, కాలుష్యం పెరగడంతో కండ్లకలక సోకుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

**చిట్కాలు పాటిస్తే...** అయితే, ఈ సమస్యకు మందులు వాడకపోయినా కిందరిలో తగ్గిపోతుందని, ఇది ఇతరులకు వేగంగా వ్యాప్తిచెందే అవకాశం ఉన్నందున పలు జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. రద్దీగా ఉండే బస్సులు, మెట్రోలో ప్రయాణం చేసే సమయంలో ఎక్కువగా కండ్లకలక సోకే ప్రమాదం ఉంటుందని, ప్రయాణ సమయంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాక్టరీయా అపరిశుభ్రంగా ఉన్న ఉపరితలాన్ని తాకవడం ద్వారా సోకుతుంది. బస్సుల్లో స్టాండ్స్, సీట్లు తదితర వాటిని తాకి.. అదే చేతులతో కండ్లను తాకవడం వంటి చేస్తే సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అపరిశుభ్రంగా ఉన్న వాటిని తాకకుండా ఉండడం మంచిదని, పలు చిట్కాలు పాటించి దీనికి దూరంగా ఉండవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

**నివారణ చర్యలు...** ఐ ఫ్లూ వ్యాప్తిని నిరోధించేందుకు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. మురికిగా ఉన్న చేతులతో కళ్లను తాకడం మంచిది కాదు. ఇలా చేయడం ద్వారా వైరస్ కళ్లకు వ్యాపిస్తుంది. ముఖ్యంగా పబ్లిక్ ప్లేసుల్లో ఎక్కడైనా చేతులతో తాకిన సందర్భంలో తప్పనిసరిగా హ్యాండ్ శానిటైజర్‌తో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా చేయడం ద్వారా కేవలం కండ్లకలక మాత్రమే కాకుండా ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. రద్దీగా ఉండే వాహనాల్లో వెళ్లిన సమయంలో కండ్లకు సన్ గ్లాసెస్ లేదంటే, సేఫ్టీ గ్లాసెస్‌ను ధరించడం మంచిది. వీటితో గాలిలో ఉండే దుమ్మూ, ధూళి నుంచి రక్షణగా ఉండడమే కాకుండా వైరల్ నుంచి కాపాడతాయి. కరోనా ఇన్ఫెక్షన్ సమయంలో ప్రతిచోటా సామాజిక దూరాన్ని పాటించారు. కండ్లకలకను సైతం నివారించడంలో సామాజిక దూరం పాటించడం అవసరం. ఐ ఫ్లూ సోకిన వ్యక్తులకు దగ్గరగా ఉంటే వేగంగా వ్యాపిస్తుంది. దూరంగా ఉంటే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. కండ్లకలక సోకితే దురగా అనిపించిన సమయంలో కండ్లపై రుద్దకూడదు. తరుచూ శుభ్రంగా కళ్లను కడగడంతో పాటు తుడుచుకోవడానికి శుభ్రమైన కాటన్ క్లాత్‌ను లేదంటే.. టిష్యూ పేపర్‌ని వాడాలి. కండ్లకలక వచ్చిన సమయంలో వ్యక్తిగత వస్తువులను మరెవరికీ ఇవ్వకూడదు. మెడికల్ దుకాణాల్లో దొరికే ఆర్టిఫిషియల్ టియర్స్‌ని వినియోగించడం ద్వారా కొంత ఫలితం ఉంటుంది. ఆ ప్యాక్‌పైనుండే సూచనలు తప్పకుండా పాటించాలి. ఇలా జాగ్రత్తలు తీసుకుంటే కండ్లకలక వేగంగా రిలీఫ్ పొందవచ్చు.

## పసుపు తింటే రోజూ
# ఎక్సర్‌సైజ్ చేసినట్టే!



పసుపు తింటే రోజూ ఎక్సర్‌సైజ్ చేసినట్టే!చిటికెడు పసుపు చాలు. వ్యాయామాలతో సమానమైన ప్రయోజనాలు అందిస్తుంది. గుండెకు ప్రయోజనం కలిగిస్తుంది. పసుపు గుండెపోటు ముప్పును 41 శాతం తగ్గిస్తుందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని 'కర్క్యుమా' అనే పదార్థం గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. వంటల్లో వేసే చిటికెడు పసుపు వల్ల పరిపూర్ణమైన ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. పరిశోధకులు తమ అధ్యయనం కోసం వివిధ వయసుల్లో ఉన్న 100 మంది మహిళలను మూడు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గంవారి ఆహారంలో పసుపును జతచేశారు. రెండో వర్గం వారికి కేవలం వ్యాయామమే సూచించారు. మూడో వర్గం వారికి ఆహారంలో పసుపును భాగం చేయలేదు. వ్యాయామం కూడా చేయొద్దని తెలిపారు. రెండు నెలల తర్వాత పసుపు తీసుకున్నవాళ్లు, వ్యాయామం చేసిన వాళ్లలో గుండె ఆరోగ్యం, రక్తం పనితీరులో ఒకే విధమైన మార్పులు కనిపించాయి. మూడో వర్గం వారిలో ఈ మార్పులేమీ కనిపించలేదు. వ్యాయామం చేసే వర్గంతో వారంలో మూడుసార్లు సైక్లింగ్, వాకింగ్, ఏరోబిక్ వ్యాయామాలు చేయించారు. పసుపు తినే వారికి రోజుకు 150 మిల్లీగ్రాములు మోతాదు సూచించారు. 60 రోజుల తర్వాత ఫలితాలను పరిశీలించారు. అయితే, ఇందులో గుండె ఆరోగ్యం, రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరును మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. మిగిలిన ఆరోగ్య సూచికలను పరిగణించ లేదు. అలా అని, పసుపు తింటే వ్యాయామం మానేయాలని మాత్రం కాదు!

# స్త్రీలకు గండం...

# అండాశయ క్యాన్సర్



**ఒవేరియన్ (అండాశయ) క్యాన్సర్ స్త్రీలలో వచ్చే క్యాన్సర్లలో మూడో స్థానంలో ఉంటుంది. రొమ్ము క్యాన్సర్‌ది మొదటి స్థానం కాగా రెండో స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఆక్రమించాయి. ఇక అండాశయ క్యాన్సర్ లక్షణాలు అంత త్వరగా బయటపడవు. పైగా ఇది చాపకింద నీరులా శరీరంలో ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. కాబట్టి, దీన్ని నిశ్శబ్ద హంతకిగా పేర్కొంటారు. ఈ క్యాన్సర్ మొదటి, రెండో దశల్లో స్వల్ప లక్షణాలు ఉండటంతో రోగులు వాటిని పెద్దగా పట్టించుకోరు. 60 నుంచి 70 శాతం మంది వ్యాధి ముదిరిన తర్వాతనే వైద్యు లను ఆశ్రయిస్తుంటారు. దీంతో చాలామంది ఈ వ్యాధికి గురై తమ ఆరోగ్యాన్ని మరణం అంచులకు తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో అండాశయ క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలి...**

అండాశయాల్లో క్యాన్సర్ కణాలు అపరిమితంగా పెరిగిపోయి పక్కన ఉన్న కణజాలానికి, ఇతర భాగాలకు వ్యాపించడాన్ని అండాశయ క్యాన్సర్ అంటారు. అండాశయాలు స్త్రీలలో గర్భాశయానికి రెండు వైపులా బాదం పప్పు పరిమాణంలో ఉంటాయి. ఇవి అండాల ఉత్పత్తితోపాటు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ అనే హార్మోన్లను విడుదల చేస్తాయి. ఈ హార్మోన్లే స్త్రీలలో నెలసరికి దోహదపడతాయి. ఇవి సక్రమంగా విడుదలైనంత కాలం సంతానలేమి, ఇతర గైనిక్ సమస్యలు దరిచేరవు. ఇక స్త్రీలకు ప్రమాదకరంగా పరిణమించే అండాశయ క్యాన్సర్ వంశ పారంపర్యంగా వచ్చే అవకాశం కూడా ఉంది. అయితే, ఇలా జరగడానికి కేవలం 5 నుంచి 10 శాతం అవకాశం మాత్రమే ఉంటుంది. మిగిలిన 90 శాతానికి కచ్చితమైన కారణాలను వివరించలేం. కుటుంబ నేపథ్యం ఉంటే రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్లకు ఒకే జన్యువు కారణమవుతుంది. దాన్ని బ్రాకా జన్యువుగా పిలుస్తారు. ఈ జన్యువు ఉన్నవారిలో రొమ్ము లేదా అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అందుకని వంశంలో లేదా కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ గానీ, అండాశయ క్యాన్సర్ గానీ ఉంటే ఆ కుటుంబసభ్యులకు ఈ క్యాన్సర్లు వచ్చే అవకాశం 5 నుంచి 10శాతం వరకు ఉండొచ్చు. బ్రాకా జన్యువులో బ్రాకా-1, బ్రాకా-2 అని రెండు రకాలు ఉంటాయి. బ్రాకా-1: ఇది రొమ్ము, అండాశయానికి సంబంధించింది. ఇది ఉన్నవారిలో రొమ్ము, అండాశయ క్యాన్సర్లు వచ్చే అవకాశాలు అధికం. బ్రాకా-2: ఇది రొమ్ము, అండాశయంతోపాటు స్త్రీ, పురుషుల్లో పాంక్రియాటిక్ క్యాన్సర్, పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్లకు కారణం అవుతుంది. కాబట్టి, కుటుంబ నేపథ్యం ఉన్నవారికి బ్రాకా పరీక్ష చేయించడం ఉత్తమం. ఈ పరీక్షలో బ్రాకా పాజిటివ్ వస్తే క్యాన్సర్ ముప్పు తగ్గించే సర్జరీలను ముందస్తుగా చేసి, రెండు అండాశయాలను తొలగించడం జరుగుతుంది.

**అండాశయ క్యాన్సర్ మూడు రకాలు....**

అండాలు, స్త్రీ హార్మోన్లయిన ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్‌లను ఉత్పత్తి చేసే అండాశయాలలో అపరిమితంగా పెరిగే కణాల ఆధారంగా అండాశయ క్యాన్సర్ మూడు రకాలు. **అవి:** 1. ఎపిథీలియల్ ఒవేరియన్ క్యాన్సర్: 90శాతం వరకు వయసు పైబడిన స్త్రీలలో వస్తుంది.

2. జెర్మ్ సెల్ ఒవేరియన్ క్యాన్సర్: ఈ కణాలు అండాల నుంచి పుడతాయి. యుక్త వయసు అమ్మాయిలలో ఈ క్యాన్సర్ తలెత్తుతుంది.

3. స్ట్రోమల్ ఒవేరియన్ క్యాన్సర్: ఈ కణాలు అండాలలో హార్మోన్లు ఉత్పత్తి అయ్యే చోట తయారవుతాయి. స్త్రీలలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు చాలా ఎక్కువగా, దీర్ఘకాలికంగా విడుదలవుతూ ఉంటే ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.


స్త్రీలలో వచ్చే క్యాన్సర్లలో అండాశయ క్యాన్సర్ 3వ స్థానంలో ఉంది. పైన పేర్కొన్న 3 రకాలే కాకుండా ఇంకా ఉప రకాలు ఉంటాయి. స్త్రీలలో 50ఏళ్లు పైబడిన తర్వాత ఎక్కువగా కనిపించే అండాశయ క్యాన్సర్‌ను నిశ్శబ్ద హంతకిగా పేర్కొనవచ్చు. లక్షణాలు ఆలస్యంగా బయటపడతాయి కాబట్టి వ్యాధి ముదిరిన తర్వాతే రోగులు డాక్టర్లను సంప్రదిస్తుంటారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే%ొ% అండాశయాలు పొత్తికడుపులో చాలా లోపలికి ఉంటాయి. కాబట్టి లక్షణాలు చాలా ఆలస్యంగా వెలుగుచూస్తాయి. అంతేకాకుండా అజీర్తి, యూరినరీ ఇన్ఫెక్షన్స్ వంటి లక్షణాలను సాధారణ సమస్యలుగా భావించే అవకాశం ఉంటుంది. తొలిదశలో ఈ లక్షణాలు అంత తీవ్రంగా లేకపోవడం వల్ల ఈ క్యాన్సర్‌ను గుర్తించడం అంత సులువు కాదు. అండాశయ క్యాన్సర్‌గా అనుమానించడానికి కొన్ని లక్షణాలు బయటపడవచ్చు.

**లక్షణాలు:**

కడుపు ఉబ్బరంగా, నొప్పిగా ఉండటం. అజీర్తి, వికారం, తేన్పులు తదితర జీర్ణసంబంధ సమస్యలు. యోని స్రావాలు అసాధారణంగా ఉండటం. మూత్రం ఎక్కువగా లేదా తరచుగా రావడం. అలసట, జ్వరం. ఎక్కువగా లేదా అంతకుముందులా ఆహారం తీసుకోకపోవడం. కొంచెం తినగానే కడుపు నిండినట్టు ఉండటం. ఊపిరి కష్టంగా ఉండటం. కలయిక కష్టంగా అనిపించడం. వెన్నునొప్పి లేదా నడుము నొప్పిగా అనిపించడం. అకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం. నెలసరి సక్రమంగా లేకపోవడం. ముందస్తు పరీక్షల్లో బ్రాకా పాజిటివ్ రావడంతో ప్రముఖ హాలీవుడ్ నటి ఏంజెలినా జోలి ముందుజాగ్రత్తగా తన రెండు రొమ్ములు తొలగించుకుని రీకన్‌స్ట్రక్షన్ చేయించుకున్నారు. దీనివల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది.

**వీరిలో ఎక్కువ...**

కుటుంబ నేపథ్యం కలిగిన స్త్రీలలో. పిల్లలు కలగని వారు. సంతానం కోసం అధిక మోతాదులో మందులు వాడిన వారిలో. హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీని దీర్ఘకాలికంగా తీసుకున్న వారు. కొవ్వు పదార్థాలు, మాంసాహారం ఎక్కువగా తీసుకునే వారిలో.



**వ్యాధి నిర్ధారణ ఇలా....** అనుమానిత లక్షణాలు ఉంటే అల్ట్రా సౌండ్‌లో సీఏ-125 మార్కర్ పరీక్ష చేయిం చుకోవాలి. దీంతోపాటు రక్త పరీక్షలు, పాప్ టెస్ట్ తదితర పరీక్షలతోపాటు సీటీ-స్కాన్, ఎంఆర్ఐ వంటివి కూడా అవసరమవుతాయి. రొమ్ము క్యాన్సర్‌కు కారణమయ్యే బ్రాకా జీన్ మ్యుటేషన్‌లో తేడాలు ఉన్నప్పుడు ఈ క్యాన్సర్ పరీక్షలు 25 ఏళ్ల వయసు నుంచి చేయించుకోవడం ఉత్తమం. మెనోపాజ్ దశకు ముందు నుంచే ఈస్ట్రోజన్ హార్మోన్‌ను మాత్రమే 5 నుంచి 10 ఏళ్ల కంటే ఎక్కువగా తీసుకుంటే ఈ క్యాన్సర్ వచ్చే ముప్పు పెరగవచ్చు. ప్రొజెస్టిరాన్ హార్మోన్ కాంబినేషన్‌లో ఈస్ట్రోజన్ తీసుకుంటే ఆ ముప్పు కొంతవరకు తగ్గేందుకు ఆస్కారం ఉంది. అన్ని క్యాన్సర్లలో లాగే అండాశయ క్యాన్సర్‌లోనూ 4 దశలు ఉంటాయి.

1వ దశ: వ్యాధి ఒకటి లేదా రెండు అండాశయాలకు మాత్రమే పరిమితమవుతుంది

2వ దశ: గర్భాశయానికి వ్యాప్తి చెందుతుంది.

3వ దశ: అండాశయాలు, గర్భాశయంతోపాటు లింఫ్ నాళాలు, పొత్తికడుపు లైనింగ్‌కు వ్యాపిస్తుంది. 4వ దశ: పైవాటితోపాటు శరీరంలో ఇతర అవయవాలకు సోకుతుంది.

**సర్జరీ థెరపీలతో చికిత్స...** వ్యాధి దశల ఆధారంగా సర్జరీ చేయడం, థెరపీలు వంటి చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. థెరపీలు ఎంతకాలం ఇవ్వాలో కూడా వ్యాధి ఉన్న దశపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబ నేపథ్యం ఉండి, బ్రాకా పాజిటివ్ వచ్చిన వారు పిల్లలు పుట్టిన తర్వాత ముందుజాగ్రత్తగా అండాశయాలను తొలగించుకోవచ్చు. ఒకవేళ క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారణ జరిగితే సర్జరీ, హైపెక్ కీమో థెరపీ చేస్తారు. హైపెక్ అనేది అత్యాధునిక చికిత్సా విధానం. ఇందులో సర్జరీ పూర్తయిన వెంటనే 41- 43 డిగ్రీల ఉష్ణోగ్రతతో కీమో ఇస్తారు. ఈ అండాశయ క్యాన్సర్ చికిత్స తర్వాత మళ్లీ 40 శాతం మందిలో తిరగబెట్టేందుకు ఆస్కారం ఉంది. అప్పుడు కూడా కీమో థెరపీతోనే చికిత్స అందిస్తారు. కొన్ని సందర్భాల్లో ఒక ప్రదేశంలోనే ఆలస్యంగా వస్తే రెండోసారి కూడా సర్జరీ చేయవచ్చు. మనోబలంతో ఉంటే మంచి ఫలితాలు, మెరుగైన జీవితాన్ని పొందడం సాధ్యమే.

**డా. గీతా నాగశ్రీ, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్**

# అవని

## మెగ్నీషియం...

## మెగా ప్రయోజనం!



మారుతున్న జీవనశైలి.. మనిషిని మంచాన పడేస్తున్నది. అవసరమైన పోషకాలు లేక.. శరీరం రోగాల పుట్టగా మారుతున్నది. చీటికీమాటికీ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నది. ముఖ్యంగా, 'మెగ్నీషియం' లోపంతో నవతరం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నది. రోజువారీ జీవితంలో కీలకపాత్ర పోషించే మెగ్నీషియం.. మనిషి శరీరంలో జరిగే సుమారు 300 రకాల రసాయనిక చర్యల్లో కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి మెగ్నీషియం లోపిస్తే.. తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ లెక్కల ప్రకారం.. ప్రతిరోజూ పురుషులకు 400 మి.గ్రా., మహిళలకు 300 మి.గ్రా. మెగ్నీషియం అవసరమవుతుంది. రోజువారీగా తీసుకునే ఆహారం ద్వారా ఇది శరీరానికి అందుతుంది. అయితే, శరీరానికి తగినంత మెగ్నీషియం అందకపోతే.. మనిషిలో అనేక లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ముందుగానే గుర్తించి, వైద్యుణ్ని సంప్రదిస్తే మంచిది. శరీరంలో మెగ్నీషియం తగినంత పరిమాణంలో ఉంటేనే.. హృదయ స్పందనలు సక్రమంగా సాగుతాయి. లేకుంటే.. హార్ట్‌రేట్ రూటు మారుతుంది. గుండె దడగా అనిపిస్తుంది. ఊపిరి పీల్చుకోవడంలోనూ ఇబ్బంది కలుగుతుంది. వికారంగా అనిపించినా, ఆకలి లేకపోయినా.. మీ శరీరంలో మెగ్నీషియం లోపం ఉన్నట్టే! జీర్ణాశయం సజావుగా పనిచేయడంలోనూ మెగ్నీషియం పాత్ర ఉంటుంది. శరీరంలో మెగ్నీషియం తగ్గితే.. జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. శరీరంలో తగినంత మెగ్నీషియం లేకుంటే.. కంటి సమస్యలూ చుట్టుముడతాయి. కళ్ల మంట, కళ్ల నుంచి నీరుకారడం లాంటి సమస్యలు కనిపిస్తాయి. కండరాల ఆరోగ్యం, పనితీరులో మెగ్నీషియం కీలకంగా వ్యవహరిస్తుంది. ఇది శరీరంలో తగినంతగా లేకపోతే తీవ్రమైన కండరాల నొప్పి, తిమ్మిరి వేధిస్తాయి. మెగ్నీషియం లోపం.. మనిషికి నిద్రను దూరం చేస్తుంది. నిద్రలేమితో పాటు తలనొప్పి, చికాకు ఇబ్బంది పెడుతాయి. ఎముకలు, నరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా, వాటి పనితీరు బాగుండాలన్నా.. కావాల్సినంత మెగ్నీషియం ఉండాల్సిందే! కాల్షియం కూడా చాలా అవసరం. ఈ ఖనిజాలలో అసమతుల్యత కండరాల తిమ్మిరి, కండరాల నొప్పికి కారణమవుతుంది. కాల్షియం, మెగ్నీషియం రెండిటినీ సమతుల్యంగా ఉంచుకోవడం చాలా అవసరం.


**ఆహారంతో అందిద్దాం..**

మెగ్నీషియం లోపం ఉన్నవారు రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. గుమ్మడి గింజలు, పాలకూర, బచ్చలికూర, అరటిపండ్లు, నల్ల జీలకర్ర, పల్లీలు, బ్రౌన్ రైస్, సాల్మన్ చేపల్లో మెగ్నీషియం ఎక్కువగా దొరుకుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, అవకాడో, నట్స్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, బీన్స్, పప్పు దినుసులు, పచ్చి బఠానీలు, శనగలు, పాలు, పెరుగు, సోయా ఉత్పత్తుల్లోనూ మెగ్నీషియం లభ్యమవుతుంది. బెర్రీలు, అంజీర్, బ్రకోలీ, క్యాబేజీ, మొలకలలోనూ మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇక శరీరంలో మెగ్నీషియం తక్షణమే ఉత్పత్తి కావాలంటే.. ఒక కప్పు కాఫీ తాగడమో.. ఒక డార్క్ చాక్లెట్ తినడమో చేయాలి.

# డబుల్ చిన్ తగ్గాలంటే...

## ఈ వ్యాయామం చేయండి..!






డబుల్ చిన్‌తో చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. కొన్ని వ్యాయామాలు డబుల్ చిన్ తొలగిం చడానికి సహాయపడతాయి. అమ్మాయిలే కాదు అబ్బాయిలు డబుల్ చిన్ కారణంగా ఇబ్బంది పడుతూ ఉంటారు. డబుల్ చిన్ ముఖ వర్చస్సును దెబ్బతీస్తుంది. గడ్డం దగ్గర ఎక్స్‌ట్రా లేయర్ కనిపించే ఈ డబుల్ చిన్ కారణంగా చాలా మంది నామోషీగా ఫీల్ అవుతూ ఉంటారు. డబుల్ చిన్ రావడానికి బరువు పెరగడం, వంశపారంపర్యం, వయస్సు పెరగడం కారణం కావచ్చు. డబుల్ చిన్ తగ్గించి.. మీ ముఖ వర్చస్సును తిరిగి పెంపొందించుకోవడానికి కొన్ని వ్యాయామాలు సహాయపడతాయి. అవేంటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి. స్ట్రైట్‌గా నిలబడి తలను వెనక్కి వంచి.. సీలింగ్ చూస్తూ ఉండండి. దాన్ని దాన్ని ముద్దాడినట్లు పెదాలతోపాటు, గడ్డాన్ని ముందుక చాపాలి. ఇలా అయిదారు సెకన్లు ఉండాలి. తర్వాత సాధారణ స్థితికి రావాలి. ఇలా పది, పదిహేనుసార్లు చేయాలి. తలను వెనక్కి వంచి.. పై కప్పు చూస్తూ ఉండాలి. నోరు పెద్దగా తెరిచి ఒకటి నుంచి అయిదు వరకు మనసులో లెక్కపెడుతూ నాలుకను మెల్లిగా బయటకు సీలింగ్ వైపునకు పెట్టాలి. ఆ తర్వాత తిరిగి అయిదు లెక్కపెడుతూ లోపలికి తీసుకోవాలి. ఇలా పది సార్లు చేయాలి. స్ట్రాట్‌గా నిలబడాలి. ఇప్పుడు గడ్డాన్ని ఛాతీకి తగిలేలా వంచి.. మెల్లిగా తలను కుడివైపు తిప్పాలి. ఈ పొజీషన్‌లో ఐదు సెకన్ల పాటు ఉండి యథాస్థానానికి రావాలి. ఇలా ఎడమవైపు కూడా చేయాలి. ముందుగా స్ట్రైట్‌గా నిలబడాలి. ఆ తర్వాత తలను ఎడమ వైపు తిప్పి, ఓ పదిసెకన్లు ఆ పొజిషన్‌లో ఉంచాలి. ఆ తర్వాత సాధారణ స్థితికి రండి. అదేవిధంగా కుడి వైపు చేయండి. ఇప్పుడు తలను కిందకు వంచి వీలై నంత వరకు కుడి వైపునకు ఓసారి... ఎడమ వైపునకు మరోసారి తిప్పాలి. ఇప్పుడు మామూలు స్థితికి రావాలి. ఇలా రెండు మూడు సార్లు చేసి.. రెస్ట్ తీసుకోండి. ఇప్పుడు మెల్లగా తలను పైకెత్తుతూ మొత్తం వెనక్కి వంచాలి. ఈ స్థితిలో ఉంటూ నోరు తెరుస్తూ, మూస్తూ ఉండా లి... ఇలా పదిసార్లు చేయాలి. ఆ తర్వాత సాధారణ స్థితికి రండి.

ఇప్పుడు తలను కుడివైపునకు కాస్త ఎత్తులో తిప్పి నోటిని తెరుస్తూ మూస్తూ పదిసార్లు చేయాలి. ఆ తర్వాత సాధారణ స్థితికి రావాలి. ఇప్పుడు రెండో వైపు రిపీట్ చేయండి. ఇది చేశాక మాములు పొజిషన్‌కు వచ్చేయాలి. రోజూ ఇలా చేస్తే.. గడ్డం కింద కొవ్వు కరుగుతుంది. మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి-కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా గడ్డం కింద కొవ్వు కరుగుతుంది. ఎక్కువగా నవ్వడం, మాట్లాడటం వల్ల కూడా ముఖ కండరాలకు చక్కని వ్యాయామం అందుతుంది. తద్వారా డబుల్ చిన్ సమస్యను తగ్గించుకోవచ్చు.

# థైరాయిడ్ పేషెంట్స్ కచ్చితంగా తినాల్సిన..

# అయోడిన్ రిచ్ ఫుడ్స్..!

ప్రస్తుతం థైరాయిడ్ సమస్యతో బాధపడేవారి సంఖ్య ఎక్కువవుతోంది. థైరాయిడ్ పేషెంట్స్ అయోడిన్ రిచ్ ఫుడ్స్ తీసుకుంటే మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్య.. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ గ్రంథి సాధారణ పనితీరుకు అంతరాయం కలిగిస్తుంది. థైరాయిడ్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే.. గుండె, మెదడు, లివర్, కిడ్నీ, చర్మంతో సహా వివిధ అవయవాలపై హానికర ప్రభావం పడే ప్రమాదం ఉంది. థైరాయిడ్ గ్రంథి నుంచి విడుదలైన హార్మోన్లు రక్తప్రవాహంలో కలిసి చాలా కీలకమైన జీవక్రియలను నిర్వహిస్తుంటాయి. శ్వాసవ్యవస్థ, సంతానోత్పత్తి వ్యవస్థ, గుండె, నాడీ, జీర్ణవ్యవస్థ.. ఇలా చాలా వాటిపై థైరాయిడ్ హార్మోన్ ప్రభావం ఉంటుంది. హార్మోన్ ఉత్పత్తిలో అసమతుల్యత థైరాయిడ్ రుగ్మతల లక్షణాలకు దారి తీస్తుంది. థైరాయిడ్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి.. ఆహారంపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యం.?



### అయోడిన్ లోపం...

థైరాయిడ్ గ్రంథి పనితీరులో అయోడిన్ కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథి మన ఆహారం నుంచి థైరాయిడ్‌ను గ్రహిస్తుంది, హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తుంది. పెద్దవారికి.. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని సరిగ్గా నిర్వహించడానికి రోజుకు సుమారు 150 మైక్రోగ్రాముల అయోడిన్ అవసరం. అయోడిన్ లోపం, అధిక అయోడిన్ రెండూ థైరాయిడ్ పనితీరుకు అంతరాయం కలిగిస్తాయి. పనితీరును మెరుగుపరచుకోవడానికి.. అయోడిన్ రిచ్ ఫుడ్స్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**థైరాయిడ్ ఉంటే.. ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..?**



**సీవీడ్..** కెల్ప్, నోరి, కొంబు వంటి సీవీడ్స్‌లో అయోడిన్ పుష్కలంగా లభిస్తుంది. కెల్ప్‌లో పాంతోతేనిక్ యాసిడ్, రిబోఫ్లావిన్ ఉంటాయి. ఇవి థైరాయిడ్ అసమతుల్యతతో సంబంధం ఉన్న ఆందోళన, డిప్రెషన్‌ను నిర్వహించడానికి తోడ్పడతాయి.

**చీజ్..**చీజ్ శరీరానికి..కాల్షియం, ఆరోగ్యకరమైన కొవ్వులను అందించడమే కాకుండా వీటిలో అయోడిన్ మెండుగా ఉంటుంది. చెడ్డార్, మోజారెల్లా చీజ్ బెస్ట్ ఆప్షన్స్. పాలలోనూ అయోడిన్ సమృద్ధిగా దొరుకుతుంది. ప్రతి 250 పాలలో దాదాపు 150 మైక్రోగ్రాముల అయోడిన్ ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**ట్యూనా..** ప్రతి 6-ఔన్సుల ట్యూనా 34 మైక్రోగ్రాముల అయోడిన్‌ను అందిస్తుంది. మీ డైట్‌లో ట్యూనా చేర్చుకుంటే.. థైరాయిడ్ పనితీరు మెరుగుపడుతుంది. ట్యూనా మోనోశాచురేటెడ్ ఫ్యాట్స్‌ను శరీరానికి అందిస్తుంది. రొయ్యలలోనూ అయోడిన్ సమృద్ధిగా లభిస్తుంది.

**గుడ్లు..** గుడ్లలో అయోడిన్ మెండుగా ఉంటుంది. ఒక పెద్ద గుడ్డులో 24 మైక్రోగ్రాములు అయోడిన్ ఉంటుంది. ఇది రోజువారి అవసరాలలో 16% సరఫరా చేస్తుంది.



**గమనిక:** ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.





# వర్షాకాలంలో ముఖం...

# జిడ్డుగా ఉందా

## ఈ ప్యాక్స్ వేయండి..



వర్షాకాలం వచ్చినప్పుడు చర్మ సమస్యలు కూడా వస్తాయి. అలాంటప్పుడు ఎలాంటి చిట్కాలు పాటించాలి. ఏం చేయాలో ఈ ఆర్టికల్‌లో తెలుసుకోండి. వర్షాకాలమైనా, ఎండకాలమైనా స్కిన్ రొటీన్ చాలా ముఖ్యం. స్కిన్ ప్రాబ్లమ్స్‌కి మెయిన్ రీజన్ వెదర్ ఎఫెక్ట్ ఉంటుంది. ఆయిలీ స్కిన్ ఉన్నవారు చాలా సమస్యల్ని ఫేస్ చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో మరింత ఇబ్బందిగా ఉంటుంది. జిడ్డుతో పాటు చర్మంలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. తేమ పెరగడం వల్ల చర్మ రంగు మారుతుంది. ఆ సమస్య తగ్గించు కునేందుకు కొన్ని ప్యాక్స్ ప్రయత్నిం చొచ్చు. దీని వల్ల మీ స్కిన్‌ని కాపాడుకోవచ్చు. అవేంటో తెలుసుకోండి.



**దోసకాయ..**(దోసకాయలో ఎన్నో గొప్ప గుణాలు ఉన్నాయి. చర్మ సమస్యల్ని దూరం చేయడంలో దోసకాయ రసం బాగా పనిచేస్తుంది. దీనిని అప్లై చేయడం వల్ల జిడ్డుతనం దూరమవుతుంది. దీనిని టోనర్‌లా కూడా చేసి వాడొచ్చు. మిక్సీలో, బ్లెండర్‌లో దోసకాయని వేసి గ్రైండ్ చేసి చర్మానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత క్లీన్ చేయండి.



**ఓట్మీల్ ప్యాక్..** ఓట్స్ కూడా చర్మానికి చాలా మంచిది. ఇవి మంచి ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తాయి. చర్మ మృతకణాలను తొలగించి చర్మ సమస్యల్ని దూరం చేయడంలో ఓట్స బాగా పనిచేస్తాయి. అందుకోసం ఏం చేయాలంటే ఓ చిన్న గిన్నెలో ఆరెంజ్ పీల్ పౌడర్, ఎర్ర పప్పు పొడి, ఓట్స్ వేయండి. రోజ్ వాటర్ వేసి పేస్టులా చేయండి. ముఖంపై అప్లై చేసి ఆరిన తర్వాత క్లీన్ చేసుకోవాలి.

**పుదీనా..**

పుదీనా ఆకులు కూడా చర్మానికి చాలా మంచిది. కొన్ని పుదీనా ఆకుల్ని తీసుకుని దానిని పేస్టులా చేయాలి. అందులో ముల్తానీ మట్టి, తేనె, పెరుగు వేసి బాగా కలపాలి. దీనిని ముఖానికి అప్లై చేయాలి. ఆరిన తర్వాత క్లీన్ చేయాలి. దీని వల్ల స్కిన్ మెరుస్తుంది.

**నీమ్ ఫేస్ ప్యాక్..** వేపాకులో చర్మ సమస్యల్ని దూరం చేసే గుణాలు ఉన్నాయి. అనేక చర్మసమస్యలకి వేపాకుల్ని ఔషధంగా వాడొచ్చు. ఇందుకోసం ఏం చేయాలంటే ఓ చిన్న గిన్నెలో రెండు స్పూన్ల ముల్తానీ మట్టి, రెండు స్పూన్ల వేపాకుల రసం, రోజ్ వాటర్ వేయాలి. దీనిని బాగా కలిపి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. 20 నిమిషాల తర్వాత కడగాలి. దీని వల్ల మొటిమలు, జిడ్డుతనం దూరమవుతుంది.

**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.



# సినిమా చూసి నటుడిని కొట్టిన మహిళ

అంజన్ రామచంద్ర, శ్రావణి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం లవ్ రెడ్డి . గత వారం థియేటర్లలోకి వచ్చి మంచి ప్రేక్షకుల నుంచి సూపర్ పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ముఖ్యంగా సినిమాలో హారో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, క్లైమాక్స్ మూవీ చూసిన ప్రతి ప్రేక్షకుడిని బాగా ఆకట్టుకున్నాయి. అయితే సినిమాకు అనుకున్నంత బజ్, ఓపెనింగ్స్ అభించకపోవడంతో బ్లాక్ బస్టర్ బట్ ఫెయిల్యూర్ మీట్ అని ఈవెంట్ పెట్టి టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయ్యారు. సినిమా బావుందని చూసిన వారంతా చెబుతున్నారని కానీ ప్రేక్షకులను రీచ్ కావట్లేదంటూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఈ పెయుల్యర్ ఈవెంట్ వార్త, టీమ్ అవేదన కాస్త వైరల్ అవడం.. ఈ విషయం మన రెబల్ స్టార్ ప్రభాస్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి తన సోషల్ మీడియాలో లవ్ రెడ్డి సినిమా రివ్యూస్ వింటున్నాను ఆల్ ది బెస్ట్ మేకర్స్ అని పోస్టు పెట్టడంతో సినిమాకు కాస్త మైలేజ్ కూడా దొరికింది. దీంతో సినిమా గురించి కొద్ది మందికి తెలిసి యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్ ఇప్పుడిప్పుడే లవ్‌రెడ్డి సినిమాను ఆదరిస్తున్నారు. ఈక్రమంలో లవ్ రెడ్డి సినిమాలో నటించిన నటులంతా సినిమా ఆడుతున్న థియేటర్లకు వెళ్లి స్వయంగా ప్రేక్షకుల స్పందనను తెలుసుకుంటున్నారు. ఈక్రమంలో థియేటర్స్ విజిట్‌కు హైదరాబాద్ నిజాంపేట జీపీఆర్ మాల్‌కు వెళ్లగా అక్కడ సినిమా క్లైమాక్స్ రన్ అవుతుంది. సరిగ్గా అదే సమయంలో ఆ థియేటర్‌లో సినిమా చూస్తున్న ఓ మహిళ హీరోయిన్‌కు, తండ్రి పాత్ర మధ్యలో వచ్చిన ఓ ఎమోషనల్ సన్నివేశాన్ని చూసి తట్టుకోలేక ఆగ్రహంతో అలాగే వెళ్లి అక్కడికి వచ్చిన తండ్రి పాత్రదారి రామస్వామిని నాలుగైదు దెబ్బలు వేసింది. పైగా షర్ట్ చిరిగింది. ఒక్కసారిగా జరిగిన ఈ హఠాత్ పరిణామంతో అక్కడికి వచ్చిన వారు భయభ్రాంతులకు గుయ్యారు. దీంతో వెంటనే తోటి నటులు అప్రమత్తం అయిన అతనిని కాపాడారు. ఇది కేవలం సినిమానే అని నిజం కాదంటూ సదరు మహిళకు నచ్చ చెప్పారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.



# 15 ఏళ్లకే హీరోయిన్ ఎంట్రీ

## మొదటి సినిమానే ఓ సెన్సేషన్

సినీరంగుల ప్రపంచంలోకి బాలనటిగా అడుగుపెట్టి ఆ తర్వాత టాప్ హీరోయిన్ గా ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. హిందీలో అనేక చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా మెరిసిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత కథానాయికగా తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇంకేముంది తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ మంచి పాపులారిటిని సంపాదించుకుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. తనే హన్సిక మోత్వాని. అల్లు అర్జున్ నటించిన దేశ ముదురు సినిమాతో హీరోయిన్ గా వెండితెరకు పరిచయమైంది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఒక్కసారిగా హన్సిక పేరు మారుమోగింది. ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. స్టార్ స్టేటస్ రాకపోయినా జనం గుండెల్లో స్థానం సంపాదించుకుంది హన్సిక. ఆమె నటనకు టాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. టాలీవుడ్, కోలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన ఈ ముద్దుగుమ్మ పలు హిట్ చిత్రాల్లో నటించింది. కానీ కొన్నాళు ్లగా ఈ బ్యూటీకి తెలుగులో ఆఫర్స్ రాలేదు. దీంతో కేవలం ఓటీటీలో పలు వెబ్ సిరీస్ చేస్తూ బిజీగా ఉంటుంది. కెరీర్ మధ్యలోనే తన స్నేహితుడి సోహైల్ ఖతురియాను వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కొన్నాళ్లపాటు సినిమా లకు దూరంగా ఉన్న హన్సిక.. పెళ్లి తర్వాత హన్సిక తన లుక్‌ను పూర్తిగా మార్చుకుని మరింత అందంగా మారింది. గతంలో హన్సిక గురించి అనేక విమర్శలు వచ్చాయి. హన్సిక హార్మోజ్ ఇంజక్షన్ వేసుకుందని జోరుగా వార్తలు వచ్చాయి. కానీ వాటిపై క్లారిటీ ఇచ్చింది. నాపై వచ్చిన ఆరోపణలు నన్ను చాలా బాధించాయని హన్సిక తెలిపింది.



# చిరంజీవికి అక్కినేని నాగార్జున ఆహ్వానం

## అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం

మెగాస్టార్ చిరంజీవి అక్కినేని జాతీయ అవార్డుకు ఎంపికయ్యారని తెలిసిందే. అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగనుంది. 2024 కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవికి ఆహ్వానం అందించాడు అక్కినేని నాగార్జున. చిరంజీవిని కలిసి అవార్డ్ సెర్మనీకి రావాల్సిందిగా ఆహ్వానపత్రికను అందించాడు నాగార్జున. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్కే సినీ ప్లెక్స్‌లో ఏఎన్నార్ శత జయంతి వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి నాగార్జునతో పాటు కుటుంబ సభ్యులు, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్ర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. రెండేళ్లకోసారి ఏఎన్నార్ అవార్డులు ఇస్తున్నామని.. ఈ సారి చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించుకున్నామని చెప్పాడు.



# నా విలువను పెంచదు..

## పీఆర్ ఏజెన్సీపై సాయి పల్లవి కామెంట్స్

ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న భామల్లో ఒకరు సాయి పల్లవి. ఈ బ్యూటీ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి అమరన్. శివకార్తికేయన్ నటిస్తోన్న ఈ చిత్రం అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. సాధారణంగా బాలీవుడ్ సెలబ్రిటీలు తమ స్టార్‌డమ్, మార్కెట్‌ను పెంచుకునేందుకు పీఆర్ ఏజెన్సీలను పెట్టుకుంటారని తెలిసిందే. అమరన్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సాయిపల్లవి బీటౌన్‌లో పీఆర్ మాఫియా గురించి చెప్పుకొచ్చింది. తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి పీఆర్ ఏజెన్సీ ఆఫర్‌ను తిరస్కరించిందట సాయిపల్లవి. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. బాలీవుడ్‌కి చెందిన ఓ వ్యక్తి ప్రొఫెషనల్‌గా నా ఇమేజ్‌ను మరింత పెంచుకునేందుకు ఏజెన్సీ అవసరమా..? అని అడిగాడు. అలా చేస్తే నేను లైమ్‌లైట్‌లో ఉంటా. అందరూ నా గురించి మాట్లాడతారని అతడు చెప్పాడు. నేను మాత్రం వద్దని చెప్పాను. ఎందుకంటే పీఆర్ ఏమీ ఇవ్వదు. అంతేకాదు పీఆర్ నా విలువను పెంచదు. నా గురించి తరచూ మాట్లాడితే జనాలకు విసుగు వస్తుంది. నేను ఖాళీ పబ్లిసిటీ కంటే నిజమైన అనుబంధానికి ఎక్కువ విలువ ఇస్తానని చెప్పుకొచ్చింది సాయిపల్లవి. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాయిపల్లవి మరోవైపు నాగచైతన్య హీరోగా నటిస్తోన్న తండేల్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇందులో శ్రీకాకుళం అమ్మాయి సత్యగా కనిపించనుంది. హిందీలో రామాయణతోపాటు టైటిల్ ఫిక్స్ కాని మరో సినిమా కూడా చేస్తోంది.



# రెండు సినిమాలతో ఉన్నదంతా పోగొట్టుకున్నాడు

బాలీవుడ్ ఇండస్ట్రీలోని టాప్ సెలబ్రెటీలలో కపిల్ శర్మ ఒగకరు. కపిల్ శర్మ టీవీ పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన షో. గత దశాబ్దానికి పైగా టీవీలో కామెడీ షోను హోస్ట్ చేస్తూ జనాలకు దగ్గరయ్యాడు కపిల్ శర్మ. అంతకుముందు అతడు స్టాండప్ కమెడియన్. ప్రస్తుతం ఈ టాక్ షో ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం అవుతుంది. కపిల్ శర్మ టీవీ పరిశ్రమలో అత్యధిక పారితోషికం తీసుకునే నటుడిగా కూడా పేరు పొందాడు. బుల్లితెర ద్వారా వందల కోట్లు సంపాదించిన కపిల్ శర్మ సినిమాల్లోకి వెళ్లి మొత్తం పోగొట్టుకున్నాడట. 'ఫీల్ ఇట్ ఇన్ యువర్ సోల్' పేరుతో యూట్యూబ్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కపిల్ శర్మ.. క్కడ తన జీవితంలో జరిగిన చేదు సంఘటనల గురించి అనేక విషయాలను పంచుకున్నాడు. అలాగే తన జీవితంలో వచ్చిన పాత రోజులను గుర్తు చేసుకున్నారు. "నేను కేవలం 1200 రూపాయలు జేబులో పెట్టుకుని ముంబైకి వచ్చాను. చాలా రోజులు నేను ఒక్క పూట కూడా తినడానికి ఇబ్బంది పడ్డాను. ఆ తర్వాత కపిల్ శర్మ షో ద్వారా సక్సెస్ అయ్యాను. అప్పుడు నా దగ్గర చాలా డబ్బు ఉంది, ఇంత డబ్బు ఉంటే నేను సినిమా నిర్మాతగా మారొచ్చు అని భావించి రెండు సినిమాలు చేశాను. కానీ డబ్బుంటే నిర్మాత కాలేరని ఆ తర్వాత అర్థమైంది. నిర్మాతగా మారాలంటే భిన్నమైన ఆలోచన, ఫ్యాషన్, నాలెడ్జ్ ఉండాలని అర్థమైంది. నా దగ్గర ఉన్న డబ్బు మొత్తం పెట్టి సినిమా చేశాను. కానీ ఆ సినిమాలు సక్సెస్ కాలేదు. దీంతో నా దగ్గరున్న డబ్బు మొత్తం పోయింది. నా బ్యాంక్ అకౌంట్ జీరో అయ్యింది. నేను సంపాదించిన డబ్బంతా పోగొట్టుకున్నాను. దీంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాను. ఆ తర్వాత నా ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. నా కష్ట సమయంలో నా భార్య గిన్నీ నాకు చాలా సహాయం చేసింది. డబ్బు పోవడంతో పాటు మరికొన్ని విషయాలు కూడా నన్ను డిప్రెషన్‌కు గురి చేశాయి. జరిగినదంతా మంచి కోసమే, నేను దాని నుండి గొప్ప పాఠాలు నేర్చుకున్నాను. ఇప్పుడు మళ్లీ సరైన దారిలోకి వచ్చాను" అని చెప్పుకొచ్చారు. టీవీ ప్రపంచంలోని ప్రముఖ తార రూపాలి గంగూలీని కపిల్ శర్మ అధిగమించి అత్యంత ధనిక టీవీ స్టార్‌గా అవతరించాడు. ఆయన ఆస్తి విలువ 300 కోట్లకు పైగానే ఉంది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో' ప్రసారమవుతోంది.





# 42 ఏళ్ల అమ్మాయితో అభిషేక్ బచ్చన్ ప్రేమకలాపం..!

బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ పర్సనల్ లైఫ్ గురించి సోషల్ మీడియాలో అనేక వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ఎక్కువగా వీరిద్దరి విడాకుల గురించే చర్చ నడుస్తుంది. మరోవైపు నటి నిమ్రత్ కౌర్ తో అభిషేక్ డేటింగ్ అంటూ మరో చర్చ తెరపైకి వచ్చింది. అయితే ఇది కేవలం రూమర్స్ మాత్రమే. ఇప్పటివరకు దీనిపై అభిషేక్, ఐశ్వర్య స్పందించలేదు. నిమ్రత్ పేరు అభిషేక్‌తో కలిపి చర్చనీయాంశం కావడంతో ఆమె గురించి చాలా విషయాలు తెలుసుకోవాలని అభిమానులు గూగుల్లో తెగ సెర్చ్ చేస్తున్నారు. ఇంతకీ ఆమె ఎవరు.. ? బ్యాక్ గ్రౌండ్ ఏంటీ అనే విషయాలపై చర్చ నడుస్తోంది. ఇక నిమ్రత్ కూడా 42 ఏళ్ల వయసులో కూడా ఒంటరిగానే ఉంది. నిమ్రత్ కౌర్ తండ్రిని కశ్మీర్‌లో తిరుగుబాటుదారులు హతమార్చారు. ఈ సంఘటన తర్వాత నిమ్రత్ కుటుంబ జీవితం పూర్తిగా మారిపోయింది. ఘటన అనంతరం నటి కుటుంబంతో సహా ఢిల్లీకి వచ్చింది. ఢిల్లీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన నిమ్రత్ మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ ప్రారంభించిన తర్వాత, నిమ్రత్‌కు చాలా ప్రకటనలలో నటించే అవకాశం వచ్చింది. నిమ్రత్ 2006లో విడుదలైన వన్ నైట్ విత్ ది కింగ్ చిత్రంలో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. కానీ 2012లో విడుదలైన 'పెడ్లర్స్' సినిమా ఈ నటికి పాపులారిటీని తెచ్చిపెట్టింది. ఎన్నో సినిమాల్లో నటించిన ఈ భామకు 'లంచ్‌బాక్స్' సినిమాతో మరింత గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత అభిషేక్ బచ్చన్‌తో కలిసి 'దసవి' సినిమాలో ముఖ్య పాత్ర పోషించింది. సినిమాలో అభిషేక్ భార్య పాత్రలో నిమ్రత్ నటించింది. అప్పటి నుంచే వీరిద్దరీ మధ్య రిలేషన్ మొదలైనట్టు టాక్.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com